01ATP16F_01ATP16F.qxd 16-03-2026 PM 10:53 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

మంగళవారం 17 మార్చి 2026 పేజీలు : 04

ఎన్నికలు రాజకీయాలకే.. మిగతా సమయం ప్రజల అభివృద్ధికే

- మంత్రి సత్యకుమార్ యాదవ్

కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

ధర్మవరం,మార్చి16,ప్రభాతవార్త

ధర్మవరం మునిసిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కౌన్సిల్ చివరి సమావేశానికి రాష్ట్రమంత్రి సత్య కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పట్టణ అభివృద్ధి,భవిష్యత్ ప్రణాళికలపై కౌన్సిల్ సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రాజకీయాలు సహజమని, అయితే మిగిలిన సమయంలో ప్రజల అభివృద్ధి కోసం అన్ని పార్టీల కౌన్సిల్ సభ్యులు కలిసి పనిచేయాలని మంత్రి సూచించారు. రాయలసీమ ప్రాంతంలో, ముఖ్యంగా ధర్మవరం ప్రాంతంలో ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న సాగు మరియు తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకుందని తెలిపారు. ప్రజలకు స్థిరమైన నీటి సరఫరా అందించడమే లక్ష్యంగా పలు కీలక ప్రాజెక్టులు అమలు చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్మార్ట్ సిటీస్ మిషన్ మరియు అమృత్ మిషన్ పథకాల ద్వారా మున్సిపాలిటీల అభివృద్ధికి సుమారు 4,000 కోట్ల నిధులు కేటాయించబడినట్లు తెలిపారు. ఈ నిధులతో పట్టణాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని వివరించారు. పట్టణ శివారు ప్రాంతాల్లో గతంలో సరైన రహదారులు లేకపోవడం, విద్యుత్ స్తంభాల కొరత వంటి సమస్యలు తీవ్రంగా ఉండేవని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం కొత్త రహదారులు నిర్మించడం, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం వంటి అభివృద్ధి పనులను మున్సిపల్ కౌన్సిల్ ద్వారా విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. పట్టణంలో పెరుగుతున్న విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయడానికి సుమారు 110 కోట్లతో ప్రత్యేక ప్రాజెక్టును చేపట్టామని మంత్రి తెలిపారు. ఈ క్రమంలో కొత్త ఇండోర్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడానికి నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. దీని వల్ల వోల్టేజ్ సమస్యలు తగ్గి తాగునీటి సరఫరా వ్యవస్థ కూడా మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని వెల్లడించారు. రవాణా మరియు ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సేతు బంధన్ స్కీమ్ పథకం కింద మంజూరు చేసిన ఫ్లైఓవర్ నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పరిహారాన్ని దశలవారీగా పంపిణీ చేయడం ద్వారా కోర్టు వివాదాలను పరిష్కరించామని చెప్పారు. పట్టణంలో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేయడానికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులతో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి పోలీస్ వ్యవస్థను ఆధునీకరించామని మంత్రి తెలిపారు. అలాగే పట్టణంలో ఎన్నో సంవత్సరాలుగా పేరుకుపోయిన సుమారు 8 లక్షల టన్నుల చెత్తను తొలగించి పరిశుభ్రమైన మరియు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. ధర్మవరం పట్టణానికి దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్‌ను తీసుకువచ్చామని మంత్రి వెల్లడించారు. అదేవిధంగా రేగటిపల్లెలో ఆయుర్వేద మెడికల్ కాలేజీ మంజూరు చేయించడం ద్వారా ఈ ప్రాంతాన్ని విద్యా మరియు వైద్య రంగాల్లో అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నామని తెలిపారు. పట్టణ అభివృద్ధి కోసం ప్రజలు కూడా పన్నులు చెల్లిస్తూ ప్రభుత్వ కార్యక్రమాలకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు పలువురు నాయకులు పాల్గొన్నారు.

వాయుబండ... సామాన్యులకు గుదిబండ

సిలిండర్ నిబంధనలు..అంతా గ్యాస్..!

- మితిమీరిన ఇండేన్‌గ్యాస్ సిబ్బంది ఆగడాలు
- రాయలచెరువులో 'బ్లాక్'కు వెళుతున్న భారత్ గ్యాస్ వైనం
- అక్రమాలపై వెల్లువెత్తుతున్న విమర్శలు

పలుకుబడి లేకుంటే వెనుబిరగాల్సిందే, యాడికిలో గ్యాస్ అక్రమాలపై సీపీఎం,సీఐటీయూ నాయకుల ధ్యర్యాదు

యాడికి(తాడిపత్రి), మార్చి16,ప్రభాతవార్త

పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావంతో ఏర్పడిన గ్యాస్ కొరత సామాన్యులకు చుక్కలు చూపిస్తోంది. గ్యాస్ కొరత లేదని ప్రభుత్వాలు, అధికారులు ప్రకటిస్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. రెండు రోజులుగా సిలిండర్ బుక్ చేసుకోవడానికి అవకాశం లేకపోవడంతో వినియోగదారుల్లో ఆందోళన నెలకొంది.ఇప్పటికే వాణిజ్య సిలిండర్ల సరఫరా నిలిపివేశారు. తాజాగా గృహావసరాలకు వినియోగించే సిలిండర్ల కాలపరిమితిని పెంచారు. సర్వర్ లోపాలతో బుకింగ్‌లు సైతం సక్రమంగా జరగడం లేదు. కేంద్రం కొత్త నిబంధనల ప్రకారం బుకింగ్ చేసిన తర్వాత సుమారు రెండున్నర రోజుల్లో సిలిండరు డెలివరీ చేయాల్సి ఉంటుంది. ఓటీపీ వచ్చిన వినిగియోగదారులకే సిలిండరు డెలివరీ ఇవ్వాలి. కానీ క్షేత్రస్థాయిలో ఈ నిబంధనలన్నీ ఒట్టి గ్యాసేనని వినియోగదారులు విమర్శలు గుప్పిస్తున్నారు. యాడికి మండలంలోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద 12 వేలు, గుత్తిలోని భారత్ గ్యాస్ ఏజెన్సీ వద్ద 6 వేల వరకు వినియోగదారులున్నట్లు తెలుస్తోంది. యాడికి మండలంలోని ఇండేన్ గ్యాస్ సిబ్బంది ఆగడాలపైనా, మాట తీరుపైనా పలువురు వినియోగదారులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఇక రాయలచెరువులో బ్లాక్‌మార్కెట్‌లో విక్రయించేవారిని తమకు అనుకూలంగా మార్చుకొని వారి ద్వారా రెట్టింపు ధరలకు విక్రయించి భారత్ గ్యాస్ సరఫరా సిబ్బంది సొమ్ము చేసుకుంటున్నారు.

ఆగడాలకు ఆనవాళ్లు..!

ఃఇటీవల యాడికికి చెందిన ఈశ్వరయ్య అనే వినియోగదారుడు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ సిబ్బందికి బుకింగ్ సమస్యపై ఫోన్ చేసి సమాధానం అడిగాడు. సిబ్బంది సమాధానం ఇబ్బందిగా అనిపించి నేరుగా గోదాము వద్దకు వెళ్లి సమాధానం సక్రమంగా చెప్పొచ్చు కదా, మహిళలెవరైనా అడిగితే ఇలాగే చెబుతావా అని అడిగితే నీవేమైనా నా లవర్‌వా అంటూ ఎగతాళి చేయడం, సమాధానం చెప్పలేనప్పుడు ఎందుకు ఏజెన్సీ తీసుకోవడమంటే మాకుమ్మడిగా దాడిచేసి, చొక్కాచించి గాయపరచడం వట్ల జనం తీవ్ర విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

ఃరాయలచెరువుకు చెందిన యోగేంద్ర ఇండేన్‌గ్యాస్ కోసం మూడు రోజులుగా ప్రతి రోజు రానుపోను 14 కి.మీ. యాడికికి తిరుగుతున్నాడు. అతను బ్రతిమాలినా ఓటీపీ వస్తేనే ఇచ్చేది అంటూ తిరస్కరించిన సిబ్బంది రాయలచెరువుకు చెందిన మరో వ్యక్తి వచ్చి ఏజెన్సీ నిర్వాహకునితో ఫోన్ చేయించగానే బుకింగ్, ఓటీపీ ఏమీ లేకుండానే అతనికి ఇండేన్‌గ్యాస్ సిలిండర్ ఇచ్చి పంపడం వట్ల టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయడం జరిగింది.

ప్రశ్నించిన వినియోగదారునిపై దాడిచేసిన ఇండేన్‌గ్యాస్ సిబ్బంది

ఃగుత్తి నుంచి రాయలచెరువుకు సరఫరా చేస్తున్న భారత్‌గ్యాస్ సిబ్బంది ఇటీవల బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయించే ఇద్దరికి రెండేసి సిలిండర్లు ఇచ్చిపంపడం, సాధారణ వినియోగ దారులు అడిగితే వెనక్కు పంపడం వట్ల విమర్శలు వ్యక్తమయ్యాయి. అదే సాధారణ వినియోగదారులు ఆ బ్లాక్ మార్కెట్ విక్రేతల వద్దకు వెళ్లి సిలిండరు అమ్మమని అడిగితే ఒకరు రూ. 2 వేలు, మరొకరు రూ.2,500లు డిమాండు చేయడం గమనార్హం.

ఃవాణిజ్య సిలిండర్ల సరఫరా ఆగిపోవడంతో హోటళ్లకు, చిరు వ్యాపారులకు గృహావసరాల సిలిండర్లనే అధిక ధరలకు విక్రయించడం, గృహావసరాల సిలిండర్ల నుంచి వాణిజ్య సిలిండర్లలోకి గ్యాస్‌ను బదలాయించడం వంటి దుశ్చర్యలకు డెలివరీ బాయ్స్ పాల్పడుతూ ప్రజల అవసరాలను తమకు అవకాశాలుగా మలచుకుంటున్నారని ఏజెన్సీ నిర్వహకులపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఃయాడికిలో గ్యాస్ ఆధారిత బ్లాక్ మార్కెట్ అక్రమాలు, అధిక ధరల విక్రయాలపై సీపీఐ, సీఐటీయూ నాయకులు సోమవారం ఘాటుగా స్పందించారు. వారు తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తూ గ్యాస్ అక్రమాలను అధికారులుగా మీరు అరికడతారా మేము రోడ్డెక్కమంటారా అంటూ వ్యాఖ్యానించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అధికారుల కనీస పర్యవేక్షణ లేకపోవడంతో ఏజెన్సీల ఆగడాలు, డెలివరీ బాయ్స్ దోపిడీలు అధికమయ్యాయని వారు విలేకరులతో పేర్కొన్నారు.

యాడికిలో యథేశ్చగా సాగుతున్న రీఫిల్లింగ్

గ్యాస్ అక్రమాలపై ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబర్లు

ఇండేన్ గ్యాస్ వినియోగదారులుఃలు 1800-2333-555 లేదా 7718955555, భారత్ గ్యాస్ వాడకందారులుఃలు1800-22-4344 లేదా 7715012345, హెచ్‌పీ వినియోగదారులుఃలు 1800-2333-555 లేదా 9493602222 నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చు.

ఃజిల్లా, మండల ఫొరసరఫరాల శాఖ అధికారులు యాడికి మండలంలోని గ్యాస్ అక్రమాలపైనా ప్రత్యేక దృష్టి సారించాలని, గ్యాస్ మార్కెట్‌లో నెలకొన్న సంక్షోభాన్ని విక్రయదారులు సొమ్ముచేసుకోకుండా అరికట్టాలని పలువురు బాధితులు కోరుతున్నారు.

రైతన్నా..మీ కోసం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆనంద్

బుక్కరాయసముద్రం, మార్చి 16 ప్రభాతవార్త

రైతన్న మీకోసం కార్యక్రమంలో రైతులకు ప్రభుత్వ కార్య క్రమాలు, పథకాలు,అన్ని విషయాల పై విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు.సోమవారం బుక్కరాయసముద్రం పంచాయితీ పరిదిలోని కొట్టాలపల్లి గ్రామంలో నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా రైతులతో జిల్లా కలెక్టర్ ముఖాముఖిగా మాట్లడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయన మాట్లడుతూ రైతుల అభివృద్ధి కోసమే రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.రైతన్న మీకోసం కార్యక్రమాన్ని ఈ నెల 16,17,18,23,24,25 తేదీల్లో ప్రతి రైతు సేవా కేంద్రం పరిదిలో నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా లో పెద్దగా నీరులేదని వరికాకుండా వేరే ఇతర పంట ఏమైనా పండించగలుగుతారా అని రైతులను అడిగి తెలుసుకున్నారు.వీలైనంత వరకు కొత్తపంటలు సాగుచేయాలన్నారు.ఉద్యాన పంటలు సాగుచేస్తే ప్రభుత్వం నుంచి మైక్రో ఇరిగేషన్ ఏర్పాటు ఇతర రకాల సహకారం అందిస్తామన్నారు.రైతుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పీఎంఎఫ్ఎం,పిఎంఈజీపి లాంటి పథకాలు అమలు చేస్తోంది,ఇందులో 35 శాతం సబ్సిడి పోగా 10శాతం రైతువాటా చెల్లించాల్సి ఉంటుందని మిగిలిన రుణం తీసుకోవచ్చున్నారు.రైతులు వాల్యూ అడిషన్ యూనిట్ పెట్టేందుకు ముందుకురావాలన్నారు.రైతులను వాల్యూ అడిషన్ వైపు మర్చలన్నారు.విలేజ్ అగ్రికల్చర్ అసిసెంట్లకు సూసించారు.ఈ సందర్భంగా రైతులు పలు సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకరాగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.జిల్లా వ్యవసాయ అధికారి ఎం.రవి మాట్లడుతూ రైతన్న మీకోసం కార్యక్రమాన్ని పరిశీలించ డానికి ఇక్కడికి రావడం జరిగింద న్నారు.రైతులకు వ్యవసాయంలో మెలకువలు, విధివిధానాలు, ప్రభుత్వ కార్యక్రమాల గురించి తెలియజేయా లన్నారు. ఏ పంటలు వేసుకోవాలి ప్రకృతి వ్యవసాయం పద్ధతులు తదితర వాటిగురించి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వారితోపాటు మండల వ్యవసాయఅధికారి శ్యామ్‌సుందర్ రెడ్డి, ఎంపిడివో సాల్మన్,సర్పంచ్ పార్వతి,హసింగ్ డిఈ రామ్మూర్తి,డిప్యూటీ తహశీల్దార్ నాగరాజు,సింగిల్‌విండో అధ్యక్షులు కేశన్న,టిడిపి మండల కన్వీనర్ లక్ష్మినారాయణ,ఎంపిటీసీ ఆదికేశవులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో దానిమ్మ తోట దగ్ధం

- అగ్నికి ఆహుతి అయిన 3 వేల దానిమ్మ చెట్లు
- బోరున విలపిస్తున్న రైతు పురుషోత్తం
- దాదాపు 45 లక్షల రూపాయల వరకు నష్టం జరిగినట్లు అంచనా

షార్ట్ సర్క్యూట్ తో కాలి బూడిదైన దానిమ్మ తోట

తాడిమర్రి మార్చి 16 (ప్రభాతవార్త)

మండల పరిధిలోని పుల్లంపల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల రైతు ఎం పురుషోత్తం కు సంబంధించిన 3 వేల దానిమ్మ చెట్లు కాలి బూడిద అయ్యాయి, అగ్ని ప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకుని అప్రమత్తమైన రైతు అగ్నిమాపక సిబ్బందికి చరవాణి ద్వారా సమాచారం ఇచ్చారు. కానీ అగ్నిమాపక వాహనం వచ్చేలోపే మొత్తం చెట్లు కాలి బూడిద అయ్యాయి. పూర్తి వివరాల్లోకి వెళితే పుల్లంపల్లి గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 14 1,82బి లో రైతు పురుషోత్తం కు ఉన్న 17 ఎకరాల పొలంలో సుమారు 45 లక్షల రూపాయల వ్యయంతో 3 వేల దానిమ్మ చెట్లను సాగు చేశారు. పంట చేతికి అందే సమయంలో అగ్ని ప్రమాదంలో మొత్తం చెట్లు కాలి బూడిదవడం తో రైతు పురుషోత్తం రోదన వర్ణనాతీతంగా తయారైంది. పంట చేతికి వస్తే చేసిన అప్పులు తీర్చవచ్చని సంతోషిస్తున్న సమయంలో ఇలాంటి దుర్ఘటన జరగడంతో రైతు కుటుంబం సర్వం కోల్పోయి రోడ్డున పడింది. సర్వం కోల్పోయిన రైతు పురుషోత్తం కుటుంబాన్ని ప్రభుత్వమే అన్ని విధాల ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

యువత ప్రాణ రక్షణ కోసం డ్రగ్స్ వద్దు

- యువతకు,ప్రజలకు హెల్మెట్ ముద్దు... ఎమ్మెల్యే రాజు..

హెల్మెట్ ధరించండి అంటూ ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాజు.జిల్లా ఎస్పీ సతీష్ కుమార్. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి. హీరో విష్ణు. హీరోయిన్ అనన్య. హెబ్బా పటేల్. నటుడు రఘు.

మడకశిర టౌన్ మార్చి 16 ప్రభాతవార్త.

యువత ప్రాణ రక్షణ కోసం డ్రగ్స్ వద్దు యువతకు,ప్రజలకు హెల్మెట్ ముద్దు అని ఎమ్మెల్యే రాజు అన్నారు. సోమవారం పట్టణంలోని అమరాపురం బస్టాండులో ఎమ్మెల్యే రాజు ఆధ్వర్యంలో తీర్చిదిద్దడం కోసం ఎస్పీ చేస్తున్న కృషికి అందరూ సహకరించాలన్నారు. డ్రగ్స్ గంజాయి కి బానిసలు అయితే జీవితం సమాజంలో చిన్న భిన్నమై ప్రాణాల మీదకు తెచ్చుకొని సమాజంలో సంఘ బహిష్కరణ ఎదుర్కొంటరన్నారు.. డ్రగ్స్ ఊబిలో చిక్కుకుంటే ఆ కుటుంబం సర్వనాశనం అవుతుంది ఆర్థికంగా చితికి పోతుందన్నారు .శిరస్సుకు హెల్మెట్ వాడకపోతే జరిగే ప్రమాదాల వల్ల ఒకరి ఆ కుటుంబానికి శాపంగా మారుతుందని అన్నారు. హెల్మెట్‌ను వాడాలన్నారు. రాష్ట్ర కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రతి నియోజకవర్గ వ్యాప్తంగా డ్రగ్స్ హెల్మెట్ వాడకంపై అవగాహన సదస్సు నిర్వహించలని రాష్ట్ర డిజిపి,రాష్ట్ర హోం మంత్రి అనిత ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. గత ఐదు సంవత్సరాలలో గంజాయిని పాఠశాల,కళాశాలల వరకు తీసుకొచ్చిందన్నారు. గతంలో దేశంలో ఎక్కడ గంజాయి దొరికిన ఆ మూలాలు ఆంధ్ర ప్రదేశ్ లో ఉండేవన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉక్కు పాదంతో డ్రగ్స్ ను అనిచి వేస్తూ డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం కృషి చేస్తూ ఉందన్నారు. ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా గంజాయి డ్రగ్స్ ఎక్కడ కనిపించిన వారి సమాచారం తెలిపి పోలీసులకు బాధ్యతగా సమాచారాన్ని తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ: హెల్మెట్ వాడకపోతే పోలీసులు కేసు నమోదు చేసి చేస్తే అలాంటివారికి మేము కూడా సహకరించమని హెల్మెట్ అన్నది మీకు రక్షణగా ఉంటుందన్న విషయాన్ని గుర్తించి సహకరించాలన్నారు అదే విధంగా డ్రగ్స్ విషయంలో యువత దూరంగా ఉంటూ భవిష్యత్తును కాపాడుకోవాలని ఆయన పేర్కొన్నారు. మారుమూల ప్రాంతంలో మహమ్మారి డ్రగ్స్ మరియు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించడం కోసం సినీ నటులు ఎంతో దూరం నుంచి వచ్చి సందేశాన్ని ఇచ్చి యువతకు స్ఫూర్తిని ఇచ్చారన్నారు.ఈ సందర్భంగా సినీ హీరో విష్ణు,రఘు,హీరోయిన్లు అనన్య ,హెబ్బా పటేల్ లు మాట్లాడుతూ: డ్రగ్స్ వాడడం

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి.హీరో విష్ణు.హీరోయిన్ అనన్య.హెబ్బా పటేల్.నటుడు రఘు .

యువత భవిష్యత్తు ప్రాణ రక్షణ కోసం డ్రగ్స్ వద్దు హెల్మెట్ ముద్దు అనే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్ నుండి అమరాపురం బస్టాండ్ వరకు ద్విచక్ర వాహనాలతో హెల్మెట్ ధరించి ఎమ్మెల్యే రాజు ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ, సతీష్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి,హీరో విష్ణు,హీరోయిన్ లు అనన్య హెబ్బా పటేల్, నటుడు రఘు తదితరులు శిరస్సు హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఎస్పీ సతీష్ కుమార్,సినిమా హీరో విష్ణు, హీరోయిన్లు అనన్య,హెబ్బా పటేల్, నటుడు రఘు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు,టిటిడి బోర్డు మెంబర్, ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ సత్య సాయి జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా

వల్ల ఏర్పడిపోయే దుష్పరిణామాలపై ప్రసంగించారు అదేవిధంగా ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి మిమ్మల్ని మీరు సంరక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు శ్రీనివాస్ మూర్తి. కెప్టెన్ దీపిక. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ లక్ష్మీనారాయణ. మున్సిపల్ చైర్మన్ నరసింహ రాజు. వైస్ చైర్మన్ లు వెంకటలక్ష్మమ్మ.ప్రభావతి. జిల్లా అధికార ప్రతినిధి నాగేంద్ర. కౌన్సిలర్లు సుజాత రమేష్. పార్వతమ్మ. విక్రమ్. శ్రీనివాసులు. ఐదు మండలాల కన్వీనర్లు.సింగల్ విండో ప్రెసిడెంట్లు. నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

02ATP27_02ATP27.qxd 16-03-2026 PM 10:20 Page 1

ప్రశాంతంగా ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు

లేపాక్షి, మార్చి 16 ప్రభాతవార్త

లేపాక్షి మండల పరిధిలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నాలుగు సెంటర్లలో మొత్తం 763 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా వారిలో 755 మంది విద్యార్థులు హాజరు కాగా వివిధ కారణాల వల్ల 8 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు ఎంఈఓ నాగరాజు, ఎంఈఓ-2 కుళ్లాయప్పలు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించడం జరిగిందని అధికారులు పేర్కొన్నారు.

అర్హత కలిగిన ప్రతి రైతన్నకు పిఎం కిసాన్ అన్నదాత సుఖీభవ

గుమ్మఘట్ట మార్చి 16 ప్రభాత వార్త

రైతన్న మీకోసం కార్యక్రమం లో మండల కన్వీనర్ కాలువ పన్నన్న

రైతులకు పిఎం కిసాన్ అన్నదాత సుఖీభవ మూడవ విడత రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాలో జమ చేయడం వల్ల రైతుల ముఖాల్లోని ఆనందాలు అవధులు లేవని గుమ్మఘట్ట మండల కన్వీనర్ కాలువ పన్నన్న పేర్కొన్నారు రాయదుర్గం శాసనసభ్యులు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆదేశాల మేరకు సోమవారం గుమ్మఘట్ట మండలం పూలకుంట గ్రామపంచాయతీ నందు రైతన్న మీకోసం కార్యక్రమం నందు ముఖ్యఅతిథిగా మండల కన్వీనర్ కాలువ పన్నన్న పాల్గొనడం జరిగినది పన్నన్న మాట్లాడుతూ గతంలో ఇచ్చిన ఎన్నికల హామీ ప్రకారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు మాట తప్పకుండా సూపర్ సిక్స్ పథకాలన్నీ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారు అని అన్నారు రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని 2029 ఎన్నికల నాటికి ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు భైరవానితిప్ప ప్రాజెక్ట్ కి నీటిని ఖచ్చితంగా సాగు నీటి ని తరలిస్తారని నమ్మకం ఉంది అని తెలియజేశారు

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వినూత్న బోధన

ఉపాధ్యాయుల ప్రత్యేక చొరవతో విద్యార్థుల కొత్తగా అడ్మిషన్

కళ్యాణదుర్గం రూరల్ మార్చి 16 ప్రభాతవార్త

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

కళ్యాణదుర్గం మండలం లోని కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా నాణ్యమైన విద్యను వినూత్న పద్ధతులతో అందిస్తున్నామని విద్యార్థుల తల్లిదండ్రులు తమకు సహకరించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు గ్రామంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలలకు వెళుతున్న విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి వారి తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న సౌకర్యాలు, బోధన విధానాలు, విద్యార్థుల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో నైపుణ్యాధారిత బోధన, సృజనాత్మక కార్యక్రమాలు, డిజిటల్ పద్ధతులు మరియు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు అలాగే ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫార్మ్‌లు, మధ్యాహ్న భోజన పథకం వంటి సౌకర్యాలను కూడా తల్లిదండ్రులకు వివరించారు. ఉపాధ్యాయుల కృషి మరియు అవగాహన కార్యక్రమాల ఫలితంగా సుమారు 10 నుంచి 15 మంది విద్యార్థులు కొత్తూరు ఉన్నత పాఠశాలలో కొత్తగా అడ్మిషన్ పొందినట్లు తెలిపారు. విద్యార్థులు కూడా ప్రభుత్వ పాఠశాలలో చేరే అవకాశాలు ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగరాజు పీఎస్ హెచ్ఎం డెగావత్ రవీంద్రనాథ్, ఉపాధ్యాయులు మల్లారెడ్డి, రామాంజనేయులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పప్పు సెనగ కొనుగోలు కేంద్రం ప్రారంభం

డి.హిరేహళ్ మార్చి16 ప్రభాతవార్త

పప్పు సెనగ కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న నాయకులు

రైతులను పలకరిస్తున్న తెదేపా నాయకులు

అన్నదాతలను ఆర్థికంగా ఆదుకోవాలన్న సదుద్దేశంతోనే తమ కూటమి ప్రభుత్వం రైతు పంటకు మద్దతు ధర కల్పించి ఆదుకుంటుందని తెదేపా మండల కన్వీనర్ పాటిల్ మోహన్ రెడ్డి, రాయదుర్గం మార్కెట్ యార్డ్ చైర్మన్ ఉండాల హనుమంత రెడ్డి పేర్కొన్నారు. సోమ వారం డి.హిరేహళ్ మండలం పులకుర్తి గ్రామంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేసి పప్పు సెనగను కొనుగోలుచేసి రైతుకు మద్దతు ధర కల్పించి మద్దతుగానిలిచిందని కన్వీనర్, మార్కెట్‌యార్డ్ చైర్మన్ తెలిపారు. ప్రభుత్వం పప్పు సెనగకు కనీస మద్దతుధర క్వింటాలుకు రూ.5875లు కల్పించిందని రైతు పండిన పప్పు సెనగ పంటను ఆర్ఎస్ కె ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయడం హర్షించదగ్గ విషయమని పప్పు సెనగ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. మండల పరిధిలోని పులకుర్తి, మల్లికేతి, దొడగట్ట, ఎం.హనుమాపురం, గొడిసెలపల్లి, గ్రామల్లో పప్పు సెనగ పండిన రైతులు, పులకుర్తి, గొడిసెలపల్లి పప్పు సెనగ కేంద్రాల్లో తమ పప్పుసెనగను విక్రయించుకోవాలని వారు సూచించారు. ఈసందర్భంగ పలు వురు పులకుర్తి గ్రామరైతులు కొనుగోలు కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వం తమకు అండగ నిలవడం సంతోషదాయకమని ఆనందం వ్యక్తం చేశారు. అన్నదాతలు ఈసందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాయదు ర్గం శాసనసభ్యులు కాలవశ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలి మార్కెట్ యార్డ్ చైర్మన్, తెదేపా మండల కన్వీనర్, చెర్లోపల్లి ఎంపీటీసీ మొండి మల్లికార్జున, మండల తెదేపా సీనియర్ నాయకుడు కురబ శంకర్ లను గ్రామ రైతులు కొనుగోలు కేంద్రం ఆవరణలో సన్మానించారు. అనంతరం తెదేపా నాయకులు గ్రామంలో ఇంటింటికి తిరిగి రైతులకు కూటమి ప్రభుత్వం రైతు పెట్టుబడి పథకం ద్వారా ఆర్థికలబ్ధి చేకూరుస్తు రైతు ఖాతాల్లో జమచేసిన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ మూడో విడత డబ్బులు విషయమై డబ్బు అందుకున్న రైతులను ఆప్యాయంగా పలకరించి ప్రభుత్వ పథకాలను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకులు గూశెప్ప, మంజునాథ, నాగరాజు, పలువురు తెదేపా నాయకులు, కార్యకర్తలు, పప్పు సెనగ రైతులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ

హిందూపురం టౌన్ మార్చి 16 ప్రభాతవార్త

పొజిషన్ సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సహకారంతో హిందూపురం మున్సిపాలిటీ 11వ వార్డులో పేదలకు పొజిషన్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర, శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ డి.ఇ రమేష్ కుమార్, బిజెపి రాష్ట్ర నాయకుడు రమేష్ రెడ్డి, 11వ వార్డు కౌన్సిలర్ అంజలి రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో పేదలకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదల నివాసాలకు భద్రత కల్పించాలనే ముఖ్య ఉద్దేశంతో చేపట్టిన పొజిషన్ సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా అందరికీ ఇంటి పట్టాలు అందించామని. 11వ వార్డులో ఎన్నో ఏళ్లుగా నివాసాలు ఉంటూ గృహాలకు పక్క పత్రాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వారి నివాసానికి హక్కుల కల్పించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ ప్రారంభం

హిందూపురం టౌన్ మార్చి 16 ప్రభాతవార్త

మజ్జిగ పంపిణీ చేస్తున్న రవికుమార్ తదితరులు

సద్గురు శ్రీ యోగి నారాయణ సేవా సమితి అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో సోమవారం నుండి నాలుగు నెలల పాటు మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరగనుంది. వేసవిని దృష్టిలో ఉంచుకుని పేదల కోసం మజ్జిగ పంపిణీ కార్యక్రమం 120 రోజులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుండి పట్టణంలోని కెవిఆర్ ఫంక్షన్ హాల్ ఎదురుగా మజ్జిగ పంపిణీ జరుగుతుందని రోజూ వంద లీటర్లు మజ్జిగ పంపిణీ చేపడుతున్నట్లు తెలిపారు. యధావిధిగా అన్నదాన కార్యక్రమం మొదలుకానుంది.

మొదటి రోజు సజావుగా పరీక్షలు

హిందూపురం టౌన్ మార్చి 16 ప్రభాతవార్త

హిందూపురం పట్టణంలో మొదటిరోజు 10వ తరగతి పరీక్షలు సజావుగా జరిగాయి. మొత్తం 2895 విద్యార్థులకు గాను 2854 మంది పరీక్షకు హాజరయ్యారు. మిగతా 41 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు అని మండల విద్యాశాఖ అధికారి గంగా ప తెలిపారు. పట్టణంలోని 12 పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించినట్లు ఆయన తెలిపారు. పటిష్ట బందోబస్తు నడుమ పరీక్ష నిర్వహించామని తెలిపారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

కంబదూరు, మార్చి 16, ప్రభాతవార్త

పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహశీల్దార్ బాలకిషన్

అమరజీవి త్యాగం మరువలేనిదని తహశీల్దార్ బాలకిషన్ అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని సోమవారం కంబదూరు తహశీల్దార్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలర్పించిన త్యాగ ధనుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణ, ఏవో మహేష్, డిప్యూటీ ఎంపీడీవో లీలావతి, తదితర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఇకనుంచైనా తాగునీటి సమస్యను పరిష్కరించండి

చివరి సమావేశాల్లో పలువురు కౌన్సిలర్లు అధికారులకు విన్నపం

మున్సిపల్ కౌన్సిల్ సమావేశ దృశ్యం

రాయదుర్గం మార్చి 16 ప్రభాతవార్త

ఐదేళ్ల కౌన్సిలర్లుగా అధికారంలో ఉండి పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కరించలేకపోయామని ఇకనుంచి అయినా అధికారులు ప్రజల అవసరాలను గుర్తించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని పలువురు కౌన్సిలర్లు అధికారులకు విన్నవించారు సోమవారం రాయదుర్గం మున్సిపల్ కౌన్సిల్ ఆఖరి సమావేశం మున్సిపల్ చైర్ పర్సన్ పోరాళ శిల్ప అధ్యక్షతన నిర్వహించారు ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు గత ఐదేళ్లలో పాలనాపరంగా సహకరించిన అధికారులకు తోటి కౌన్సిలర్లకు మున్సిపల్ చైర్పర్సన్ కు కృతజ్ఞతలు తెలిపారు అజెండాలోని పొందుపరిచిన అంశాలన్నింటినీ ఏకగ్రీవంగా ఆమోదించారు అనంతరం కౌన్సిలర్ గోవిందరాజులు మాట్లాడుతూ అధికారం లేకపోయినా ప్రజలతో మమేకమై ప్రజా సమస్యల కోసం అందరూ కలిసికట్టుగా పని చేయాలని తోటి కౌన్సిలర్లకు పిలుపునిచ్చారు కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మా వార్డులో ఎన్నో ఏళ్లుగా అధ్వాన్ని స్థితిలో ఉన్న రోడ్డు స్థానిక ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిమెంట్ రోడ్డు వేయించడంతో ఆయన ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపాడు అనంతరం కౌన్సిలర్లకు భోజనాలు ఏర్పాటు చేశారు చివరి సమావేశం కు పట్టణ ప్రముఖులు హాజరై కౌన్సిలర్లను సన్మానించారు.

పిజిఆర్ఎస్ వినతులకు నాణ్యమైన పరిష్కారం అందించండి

జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పుట్టపర్తి(కలెక్టరేట్), మార్చి 16, ప్రభాతవార్త

ప్రజల నుండి వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజలు అందించే వినతులకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలు నందు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో డిఆర్వోవిజయసారధి, ఎస్డీసీసూర్యనారాయణరెడ్డి, ఆర్డీఓసువర్ణ తదితరులు ప్రజలనుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్పి, రీఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారులనుండి వారు అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 182 అర్జీలు రాగా వాటిపై తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఎండార్స్ చేశారు.

పర్యావరణ పరిరక్షణే మా సంకల్పం రాజయోగి భాస్కర్ నాయుడు

మాట్లాడుతున్న పర్యావరణవేత్త భాస్కర్ నాయుడు

హిందూపురం మార్చి 16 ప్రభాతవార్త

సకల జీవరాసుల మనుగడ కు పర్యావరణ పరిరక్షణ కీలకమని సౌత్ ఇండియన్ హ్యూమన్ రైట్స్ కల్చర్ నేషన్ హ్యూమన్ రైట్స్ అధ్యక్షులు రాజయోగి భాస్కర్ నాయుడు పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ స్వచ్ఛంద సంస్థ సౌత్ ఇండియా అధ్యక్షులుగా రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి జగదీష్, ఉపాధ్యక్షులుగా బిజెపి నాయకులు, కురుబ చలపతిని నియమిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా స్వచ్ఛందంగా ఈ సంస్థ పనిచేస్తుందని ఆయన చెప్పారు చెట్ల పరిరక్షణ, మొక్కల పెంపకం ప్రతి ఒక్కరు చేయాలని అది సామాజిక బాధ్యతగా గుర్తించాలని కోరారు. చలపతి మాట్లాడుతూ జన్మకు కారణమైన కన్నతల్లి, భూమాత రక్షణ మనబాధ్యతని చెప్పారు. కార్యక్రమంలో శంకరప్ప, నాగరాజు ప్రసాద్,రవి మొదలగువారు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు

కంబదూరు, మార్చి 16, ప్రభాతవార్త

ఏపీవ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో కంబదూరు మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాల, కస్తూరుబా గాంధీ పాఠశాలలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించగా గంట ముందుగానే పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను అధికారులు అనుమతించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష నిర్వహణ అధికారులు అన్ని వసతులు కల్పించారు. మండల పరిధిలోని విద్యార్థుల కోసం రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 527 మంది విద్యార్థులకు గాను 524 మంది విద్యార్థులు తొలి రోజు పరీక్షలకు హాజరు కాగా, ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓ 2 మదన్ మోహన్ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎస్సై లోకేష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

తహశీల్దారు కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

బెలుగుప్ప, మార్చి 16 ప్రభాతవార్త

పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎంపిడిఓ

బెలుగుప్ప మండల కేంద్రంలోని తహశీల్దారు కార్యాలయంలో సోమవారం అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మండల పరిషత్ అధికారి లక్ష్మినారాయణతోపాటు రీ సర్వే తహశీల్దారు గురుబ్రహ్మ ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆంధ్రరాష్ట్రం కోసం 58 రోజులు ఆమరణ నిరాహార దీక్షలు చేపట్టడం, బాషా ప్రాశస్త రాష్ట్రంగా ఏర్పడిందని, అమరావతిలో 58 అడుగుల కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ అమ్మవారి దేవస్థానానికి వేసిన రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే

రామగిరి, మార్చి 16 ప్రభాతవార్త

రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి మండలం, గంగంపల్లి గ్రామ సమీపంలోని దుర్గమ్మ అమ్మవారి దేవస్థానం దగ్గర 50లక్షల ఎన్ఆర్ ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న సి.సి. రోడ్ల పనులను స్థానిక నాయకులతో కలసి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా అవసరమైన చోట సిసి రోడ్లు, డ్రైనేజీలు త్వరితగతిన పూర్తి చేస్తూ ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు.

ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

అనంతపురం కల్చరల్, మార్చి 16 ప్రభాతవార్త

పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలు వేసి నివాళులు అర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా 1984- 85 సంవత్సరపు విద్యార్థులు, మొదటి రోడ్డులో గల పొట్టి శ్రీరాములు మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలను సందర్శించి, నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం తమ ప్రాణాలు సైతం అర్పించిన మహనీయుడన్నారు. తెలుగువారికి ప్రత్యేకంగా రాష్ట్రం ఉండాలనే తపనతో పొట్టిశ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి చివరికి ప్రాణ త్యాగం చేసి ప్రత్యేక రాష్ట్రం సాధించి తెలుగువారి గుండెల్లో అమరజీవిగా నిలిచారన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులందరికీ మిఠాయిలను పంచడం అయినది. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

ప్రశాంతగా పదవ తరగతి పరీక్షలు

బ్రహ్మసముద్రం మార్చి 16 ప్రభాతవార్త

బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్ఐ

బ్రహ్మసముద్రం మండల కేంద్రం నిర్వహించిన 10వతరగతి మొదటి రోజు నిరర్వహించిన పరీక్షలు ప్రశాంతగా ముగిసాయి బ్రహ్మసముద్రం ఎస్ ఐ సాయికుమార్ ఎలాంటి సమస్యలు జరుగకుండా గట్టి బందోబస్తూ నిర్వహించారు రెండు సెంటర్లనుదు ముగ్గురు విద్యార్థులు పరీక్షకు హాజర్ కాసలేదు మొత్తం మీద ఎలాంటి సమస్యలు లేక్కు డా ఎగ్జామ్స్ ముగిసాయి.

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి పొట్టిశ్రీరాములు

ధర్మవరంటౌన్ , మార్చి 16 ప్రభాతవార్త

పొట్టిశ్రీరాముల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రిసత్యకుమార్యాదవ్

ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన చివరికి ప్రాణాలు సైతం త్యాగం చేసిప్రజల గుండెలో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి పొట్టి శ్రీరాములని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు 126వ జయంతి సందర్భంగా స్థానిక పొట్టిశ్రీరాములు విగ్రహానికి సోమవారం మంత్రిసత్య కుమార్యాదవ్, తదితరులు విరివిగా జనసేన రాష్ట్రప్రధానకార్యదర్శి చిలకంమధుసూదన్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం తమ ప్రాణాలు సైతం అర్పించిన మహనీయుడన్నారు. తెలుగువారికి ప్రత్యేకంగా రాష్ట్రం ఉండాలనే తపనతో పొట్టిశ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి చివరికి ప్రాణ త్యాగం చేసి ప్రత్యేక రాష్ట్రం సాధించి తెలుగువారి గుండెల్లో అమరజీవిగా నిలిచారన్నారు శ్రీరాములు త్యాగం యువతకు ప్రేరణ అని, సమాజసేవకోసం ఆయన చూపిన మార్గాన్ని అనుసరించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు సంధిరెడ్డి శ్రీనివాసులు, నియోజకవర్గ బీజేపీ ఇన్చార్జ్ హరీశ్ బాబు, బీజేపీపటణ, రూరల్ అధ్యక్షుడు జింకాచంద్ర, గొట్లూరు చంద్ర,ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణయాదవ్, నాయకులు అంబటిసతీశ్, సాకే ఓబుశేశు, గుండా పుల్లయ్య, అంగజాల రాజు, ఓంప్రకాశ్ గౌడ్ పాల్గొన్నారు. జనసేన నాయకులు రాజారెడ్డి, కోటికి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన మందుల పంపిణీపై డీసీహెచ్ఎస్ విచారణ..!

- సిబ్బంది బాధ్యతగా లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

- ఘటనపై సమగ్ర విచారణ చేయిస్తామని చెప్పిన డీసీహెచ్ఎస్

మందుల గదిని పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ డేవిడ్ సెల్వరాజ్

వార్త ప్రభావం

ఉరవకొండ, మార్చి 16 ప్రభాతవార్త

ఉరవకొండ 50 పడకల ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో రోగికి కాలం చెల్లిన మందులు పంపిణీ ఘటనపై సోమవారం మధ్యాన్నం డీసీహెచ్ఎస్ డాక్టర్ డేవిడ్ సెల్వరాజ్ విచారణ నిర్వహించారు. ఆసుపత్రికి వచ్చిన అబ్దుల్ అనే రోగికి ఈనెల 14వ తేదీన

వైద్యులకు సూచనలిస్తున్న డీసీహెచ్ఎస్ సెల్వరాజ్

కాలం చెల్లిన ట్రిప్సిన్, క్రిమోట్రిప్సిన్ మాత్రలు అందించిన విషయమై 'వార్త'లో ఈనెల 15న "ఉరవకొండ ప్రభుత్వాసుపత్రిలో రోగులకు కాలం చెల్లిన మందుల పంపిణీ..!" శీర్షికన ప్రత్యేక కథనం వెలువడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఆయన విచారణ చేపట్టారు. ఆసుపత్రికి చేరుకున్న ఆయన డ్రగ్ స్టోర్, మందులు ఇచ్చే గదిని తనిఖీ చేసి అక్కడ రోగులకు పంపిణీ చేయడానికి నిల్వ చేసిన మందులను వాటి తయారీ, ఎక్స్పైరీ డేట్లకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. కాలం చెల్లిన మాత్రలు మందులు ఇచ్చే గదిలోకి ఎలా వచ్చాయని, ఎలా రోగికి అందించారని ఫార్మసి సిబ్బందిని ప్రశ్నించారు. విధి నిర్వహణలో ఇంత నిర్లక్ష్యంగా ఎలా ఉంటారని ఇది చాలా పెద్ద తప్పన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. ఘటనపై సమగ్ర విచారణకై అధికారులను నియమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ గంగాధర్, డాక్టర్ అర్జున్, డాక్టర్ రాజేష్, డాక్టర్ ప్రతిమ, ఫార్మసిస్టులు శ్రీధర్, ఫార్మసి అసిస్టెంట్ బాలకృష్ణ సిబ్బంది ఉన్నారు.

కంబదూరులో రైతన్న మీకోసం కార్యక్రమం

రైతన్న మీకోసం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు

కంబదూరు, మార్చి 16, ప్రభాత వార్త

కంబదూరు మండల కేంద్రంలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ అధికారులు తహశీల్దార్ కార్యాలయం, రైతు సేవా కేంద్రాల వద్ద సోమవారం నిర్వహించారు.ఈ సందర్భంగా తహశీల్దార్ బాలకిషన్ , ఏవో మహేష్ రైతులతో కలసి రైతన్న మీకోసం కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ 10 రోజులపాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. రైతులకు సాగు విధానాలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం రైతన్న మీకోసం కార్యక్రమాన్ని తీసుకొచ్చిందన్నారు. రాబోయే ఖరీఫ్ సీజన్ దృష్టిలో ఉంచుకొని పంటలు సాగు చేసే పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యం, ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు సూచించారు. ప్రధానంగా పొలం ఉన్న ప్రతి రైతు విశిష్ట సంఖ్య కలిగి ఉండాలని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణ, రైతు సేవా కేంద్రం సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

పంట సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో మహేష్

03ATP16_03ATP16.qxd 16-03-2026 PM 10:59 Page 1

నృత్య కళాకారిణి ప్రేమ సాహితికి అండగా గిల్డ్ ఆఫ్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ కమిటి

నృత్య కళాకారిణి ప్రేమ సాహితీని సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం, మార్చి 16 ప్రభాతవార్త బ్యూరో
జాతీయ స్థాయి నృత్య పోటీలకు ఎంపికైన చిరుతార, బాల నృత్య కళాకారిణి ప్రేమ సాహితికి గిల్డ్ ఆఫ్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఆర్థిక సహాయంగా రూ.25,000 అందజేశారు. ఈ సందర్భంగా వారు తెలియజేస్తూ.. మన ప్రాంతం పేరును చాటిచె ప్పడానికి సిద్ధమవుతున్న చిన్నారిని గుర్తించి, ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కమిటీ సభ్యులు ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో గిల్డ్ ఆఫ్ సర్వీస్ ప్రతినిధులు ఎం.ఆర్.వాణి, అరుంధతి, షమీమ్ సఫి, సుశీల, అరుణ పాల్గొని ప్రేమ సాహితికి ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు. కళాకారులను ప్రోత్సహించడం మన బాధ్యత అని కావున జాతీయ పోటీల్లో ప్రేమ సాహితి విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుందాం అని గిల్డాఫ్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

పివికెకె ఐటి కళాశాలలో ఇఫ్తార్ విందు

ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం, మార్చి 16 ప్రభాతవార్త బ్యూరో
నగర శివారులోని పీవీకేకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో మైనారిటీ సెల్, స్టూడెంట్ యాక్టివిటీ సెల్ సంయుక్తంగా నిర్వహించిన ఇఫ్తార్ కా ర్యక్రమం కళాశాల ప్రాం గణంలో ఘనంగా నిర్వహిం చా రు. రిటైర్డ్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జనాబ్ అమీర్ బాషా హాజరై విద్యార్థులకు విలువైన సందేశం అందించారు. చైర్మన్ డా. పల్లెకిశోర్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రిన్సిపాల్ డా.బి.రమేష్ బాబు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మేనేజర్ అనురాగ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 250 మందికిపైగా విద్యార్థులు పాల్గొని ప్రార్థనలు చేసి అనంతరం పండ్లు, అల్పాహారంతో ఉపవాస విర మణ చేశారు. కార్యక్రమానికి ముందుగా పీవీకేకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నా లజీ, పీవీకేకేఐటీ డిప్లొమా కళాశాలల అధ్యాపకులు, సిబ్బందికి 450 ఫ్రూట్ బౌల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని మైనారిటీ సెల్ కన్వీనర్ బాబా సలాహుద్దీన్, స్టూడెంట్ యాక్టివిటీ సెల్ కన్వీనర్ ఆనంద్ దంపెల్ల సమన్వయం చేశారు.

రంజాన్ పండుగ సందర్భంగా చీరల పంపిణీ


రంజాన్‌తోఫాను పంపిణీ చేస్తున్న దృశ్యం

అనంతపురం, మార్చి 16 ప్రభాతవార్త బ్యూరో
పట్టణంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గౌస్ మోహిద్దీన్ రంజాన్ పండుగ సందర్భంగా 1000 మంది మహిళలకు చీరల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు, రాష్ట్ర ముతవల్లిల సంఘం అధ్యక్షులు అల్లాజ్ కె. యం. షకీల్ షఫీ, మాజీ గ్రంథాలయ చైర్మన్ సాలార్ భాషా, మాజీ మున్సి పల్ చైర్మన్ నూర్ మహమ్మద్, రాయల్ మురళి, మణికంత, పూల బాషా, మాజీ కో ఆప్షన్ సభ్యులు మునవర్, బాబా ఫక్రుద్దీన్, ప్రభుత్వ ఖాజీ జాహిద్ హుస్సేన్, కట్టుబడి బాబాజీ, షేక్ నూర్ బాబా తదితరులు హాజరయ్యారు.

ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతున్న ప్రైవేట్ ఎంసెట్ కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్

కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, మార్చి 16 ప్రభాతవార్త
ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నటువంటి ప్రైవేట్ ఎంసెట్ కోచింగ్ సెంటర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్ కోరారు. సోమవారం కలెక్టరేట్లో జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓతురు పరమేష్ మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ పరీక్షల మూసిన వెంటనే దీనిని అవకాశంగా తీసుకున్న ప్రైవేట్ ఎంసెట్ కోచింగ్ సెంటర్లు విద్యార్థులకు తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి షార్ట్ ఎంసెట్ కోచింగ్ పేరుతో ఒక్కొక్క విద్యార్థి నుంచి రూ.15000 నుంచి 25 వేల వరకు వసూలు చేసుకుని ఏ మాత్రం ప్రభుత్వ నిబంధనలు పాటించుకోకుండా ఇష్టం రాజ్యాంగా కోచింగ్ సెంటరులు వ్యక్తుల పేర్లతో ఏర్పాటు చేసుకొని విద్యార్థులను తల్లిదండ్రులతో దండుకుంటున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. కోచింగ్ సెంటర్లకు అనుబంధంగా ప్రభుత్వం వేసవికాలం సెలవుల్లో ఎంసెట్ కోచింగ్ సెంటర్‌లో ఉన్నటువంటి విద్యార్థులకు బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టల్స్‌ను కొనసాగించి విద్యార్థులకు చదువుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అనంతపురం నగర అధ్యక్షులు భీమేష్, ఉపాధ్యక్షులు వంశీ, గణేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కళాప్రపూర్ణుడు పాటిల్ రాజశేఖర్ - జిల్లా ఎస్పీ జగదీష్


రిటైర్డ్ అయిన ఎస్సైకి సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ

అనంతపురం క్రైమ్, మార్చి 16, ప్రభాతవార్త
అనంతపురం కమ్యూనికేషన్ ఎస్సై పాటిల్ రాజశేఖర్ కళా ప్రపూ ర్ణుడు అని జిల్లా ఎస్పీ పి.జగదీష్ కొనియాడారు. రాజశేఖర్ రిటైర్డ్ అయిన సందర్భంగా ఎస్పీ చేతుల మీదుగా ప్రత్యేక జ్ఞాపికలు, శాలువాలతో సన్మానించారు. కమ్యూనికేషన్ విభాగం సీఐ ఖాదర్ బి, ఎస్ బి సిఐ క్రాంతికుమార్ పాల్గొన్నారు. పాటిల్ రాజశేఖర్ ఒక కళాకారుడే కాక ప్రజా సేవలో ప్రతిష్ఠాత్మక స్వచ్ఛంద కార్యకర్త అన్నారు. ఉద్యోగ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించడం మాత్రమే కాదు, ఉరవకొండలో స్థాపించిన "అమ్మ తొలి దైవం" స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా కూచిపూడి నాట్యం, సంగీత కళాకారులను పశ్చిమంగా తీర్చిదిద్దుతూ, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. సు 20 ఏళ్లుగా ప్రజల కోసం కళాసేవలో నిస్వార్థంగా సమర్పణ చూపారన్నారు. "రాజశేఖర్ మంచి గాయకుడు, సమర్థ స్వచ్ఛంద సేవకుడు, ప్రజలకి ఆదర్శంగా నిలిచిన వ్యక్తి" అని ఎస్పీ అభినందించారు.

రంజాన్ తోఫా పంపిణీ చేసిన మైనార్టీ నేతలు


రంజాన్ తోఫాను పంపిణీ చేస్తున్న మైనార్టీ నేతలు

అనంతపురం సిటీ, మార్చి 16 ప్రభాతవార్త
నగరంలోని హెచ్‌ఎల్‌సీ కాలనీలో పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్‌తోఫాను మైనార్టీ నేతలు అందించారు. బిజెపి మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ రఫితోపాటు రోటరీ క్లబ్ మెంబర్ దస్తగిరిలు మైనార్టీ కుటుంబాలకు రంజాన్ తోఫాను అందిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద ముస్లిం కుటుం బాలు కూడా సంతోషంగా రంజాన్‌ను జరుపుకోవాలన్న ఉద్దేశ్యంతో పండగకు అవస రమైన నిత్యావసర వస్తువులను అందించడం జరిగిందని వారు పేర్కొన్నారు.

అమరావతిలో అమరజీవి విగ్రహం నిలువెత్తు త్యాగానికి ప్రతీక

- అమరజీవి జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత
- అభివృద్ధి పనులపై నివేదిక తయారు చేయాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం

రామగిరి, మార్చి 16 ప్రభాతవార్త
అమరావతిలో ఏర్పాటు చేసిన 58 అడుగుల పొట్టి శ్రీరాములు కాంశ్య విగ్రహం నిలువెత్తు త్యాగానికి ప్రతీకగా నిలుస్తుందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రామగిరి ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆవిష్కరించిన పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని వర్చువల్‌గా తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. తెలుగు మాట్లాడే ప్రజలంతా ఒక్కటిగా, ఒక రాష్ట్రంగా ఉండాలని పోరాటం చేసిన గొప్ప వ్యక్తి పొట్టి శ్రీరాములు అన్నారు. గాంధీజీ చూపిన మార్గంలో నడుస్తూ.. 58రోజుల పాటు నిరవధిక నిరాహార దీక్షలు చేసి రాష్ట్రాన్ని తెచ్చిపెట్టారన్నారు. ఆయన త్యాగం ఎప్పటికీ గుర్తుండిపోయేలా రాజధాని అమరావతిలో పొట్టి శ్రీరాములు 58 అడుగుల కాంశ్య విగ్రహాన్ని ఆవిష్కరించరించడం గొప్ప విషయమన్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్‌గా నామకరణం చేశారన్నారు. పొట్టి శ్రీరాములు త్యాగం గురించి ఈ తరం వాళ్లు తెలుసుకోవాలన్నారు. గాంధీజీ, పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో ఆర్యవైశ్యులు అనేక సామాజిక ఉద్యమాల్లో భాగస్వాముల య్యార న్నారు. అందుకే ఆర్యవైశ్యులకు సమాజంలో ఎప్పటికీ ఒక ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు.


వర్చువల్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీతతోపాటు నాయకులు

పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

అభివృద్ధి పనుల ప్రణాళికలు సిద్ధం చేయండి : రామగిరి మండలాధికారులతో ఎమ్మెల్యే పరిటాల సునీత సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న పనుల గురించి చర్చించారు. ప్రస్తుతం ఉపాధి హామీతో పాటు ఇతర నిధుల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి చర్చించారు. ప్రస్తుతం జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే ఇంకా చేపట్టాల్సిన పనుల గురించి చర్చించి.. వాటిపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. గత 20నెలల్లో మండలంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా రోడ్ల నిర్మాణాలు చేపట్టిన విషయం ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత తెలిపారు. మరో ఏడాదిలో మండలంలో ఏ గ్రామంలో కూడా రోడ్లు, ఇతర సమస్యలు లేకుండా చేస్తామన్నారు...

యువతకు ప్రోత్సాహం ఉంటుంది

- 40 ఏళ్లుగా పార్టీలో ఉన్నారు..మీ కుటుంబాన్ని మర్చిపోము - కేయం బ్రదర్స్‌కు హిత, ధైర్య వచనాలు తెలియజేసిన నారా లోకేష్

నారాలోకేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కేయం బ్రదర్స్

అనంతపురం, మార్చి 16 ప్రభాతవార్త బ్యూరో
మీరు మా కుటుంబ సభ్యులు.. మాతోనే దశాబ్దాలుగా ప్రయాణం కొనసాగిస్తున్నారు..మీ కుటుంబాన్ని మేము మర్చిపోము.. మా అండదండలు ఎప్పటికీ ఉంటాయి అంటూ కేయం బ్రదర్స్ అనంత మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అర్షద్, అరాఫత్‌లకు మంత్రి నారా లోకేష్ అభయ హస్తం అందించారు. విజయ వాడలోని ముఖ్యమంత్రి స్వగృహంలో మంత్రి నారా లోకేష్‌తో అనంత మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అర్షద్, అరాఫత్‌లు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నారా లోకేష్ తమను ఎంతో ఆప్యాయంగా పలకరించారని కేఎమ్ బ్రదర్స్ ఆనందం వ్యక్తం చేశారు. యువతకు తెలుగుదేశం పార్టీలో ప్రోత్సాహం ఎప్పటికీ ఉంటుందని, మిమ్ములను ప్రోత్సహించే బాధ్యత నాదేనని తెలిపినట్లు తెలిపారు. టిడిపి మైనార్టీల పక్షపాతి అని, మైనార్టీ యువతను ప్రోత్సహించడంలో తాము ఎప్పుడూ ముందుంటామని యువ నాయకులకు నారా లోకేష్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. దివంగత జకీవుల్లా ప్రతి ఎన్నికల్లో పార్టీ గెలుపుకు ఏ విధంగా కృషి చేశాడు, అనే విషయం ఈ సందర్భంగా లోకేష్ గుర్తు చేసుకున్నట్లు తెలిపారు. తమ నాయకుడు మంత్రి లోకేష్‌తో దాదాపు 30 నిమిషాలు గడిపినందుకు కేయం బ్రదర్స్ ఆనందం వ్యక్తం చేశారు.

వెంటనే నాలుగు లేబర్ కోడ్‌లను తీసి వేసి యదా విధిగా కార్మిక చట్టాలను కొనసాగించాలి

- పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమంలో కార్మిక యూనియన్ నేతలు


పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాల నేతలు, కార్మికులు


జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి సమస్యను వివరిస్తున్న దృశ్యం

అనంతపురం, మార్చి 16 ప్రభాతవార్త బ్యూరో
కనీస వేతనం, బోనస్ , సమాన వేతనం వంటి హక్కులను బలహీన పరిస్తుంది. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను ఏప్రిల్ 1 తేదీ నుండి అమలు పరచడాన్ని వ్యతిరేకిస్తున్నామని, గతంలో ఉన్న 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించుటయే లక్ష్యంగా నిరసన కార్యక్రమాలు చేస్తు న్నట్లు ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, నగర అధ్యక్షులు దావీదు, జిల్లా కమిటీ సభ్యులు రాజశేఖర్ శెట్టి, జిలాన్, రాందాస్ పేర్కొ న్నారు. నగరంలోని సంగమేస్ పెట్రోల్ బంక్ నుండి కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీగా కలెక్టర్ కార్యాలయం గేటు వద్దకు చేరుకుని అక్కడ ధర్నా నిర్వహించారు. అరుణోదయ కళాకారులు విప్లవ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. అనంతరం జిల్లా జాయిం ట్ కలెక్టర్ విష్ణు చరణ్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేతనాలు పెంచే కమిటీలో ఎక్కు వ ప్రాధాన్యత యాజమా న్యాలకి ఇవ్వడం, జాతీయ కనీస వేతనం కార్మికు లకు రోజువారి వేతనం రూ.178 నిర్ణయించడం, యాజమాన్యాలు జీతాలు చెల్లించకపోతే క్రిమినల్ కేసులు పెట్టె అవకాశాన్ని తీసివేయడం, లేబర్ అధికారులతో తని ఖీలు లేకుండా చేయడం, శాశ్విత ఉద్యోగుల స్థానంలో ఫిక్సడ్ టర్మ్ కార్మికులను తీసుకోవడం, యూనియన్ నమోదు కావాలంటే వందమంది సభ్యులు ఉండాలనే నిబంధనలు పెట్టడం, చిన్న యూనియన్లను అడ్డుకోవడం సమ్మెల పైన కఠిన నిబంధనలు పెట్టడం, కార్మికులు చేసే ఏ పోరాటమైనా అక్రమని యాజమాన్యాలు ప్రకటించే హక్కును కలిగి ఉండడం వంటి వన్నారు. పని ప్రదేశాలలో కార్మికులకు సంబంధించి భద్రత విష యాన్ని పాత చట్టాలను రద్దు చేయడం, 12 గంటల పని విధానాన్ని ప్రవే శపెట్టడం, అధిక ఓవర్ టైంను చట్టబ్ధద్ధ చేయడం అన్నారు. గతంలో పది మంది ఉన్న కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ గ్రాడ్యుటీ కార్మికులకు హక్కుగా ఉండేది ఇప్పుడు 20 మంది ఉన్న సం స్థల్లోనే చట్టాలు వర్తిం పజేయడం యాజమాన్యాలకు పూర్తి హక్కులు కలిగి ఉండడం తగదన్నారు. కార్మికులు స్వాతంత్రానికి పూర్వం, తర్వాత అనేక త్యాగాలు చేసి సాధిం చుకున్న హక్కులు సౌకర్యాలను కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారు వర్గాలకు బహుళ జాతి కంపెనీలకు కార్పొ రేట్ కంపెనీలకు అనుకూలమైనటువంటి నాలుగు లేబర్ కోడ్‌లు తీసు కురావ డంతో కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులన్నీ నిర్వీర్యం కావడం జరుగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ కార్మికులకు గొప్పగా ఉపయోగ పడతాయని ప్రచారం చేస్తున్నా రన్నారు. కార్మికు ల కు హక్కుగా ఉన్న చట్టాల స్థానంలో కోడ్ల వలన ఉపయో గము లేదు దీని వలనే కార్మికులు తీవ్రభయాందోళనలకు గురవుతూ తమ ఉద్యోగాలకు భద్రత లేదని ఆందోళన చెందుతున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు నర సప్ప, ఈశ్వర య్య, లక్ష్మినా రాయణ, దాదుబీ, లక్ష్మిదేవి, రామంజి, అరుణోదయ కళాకా రులు చంద్రప్ప, ముత్యాలు, రాజేష్, మహేష్‌లు పేర్కొన్నారు.

కార్మికుల హక్కులు హరించడం తగదు

- లేబర్ ఆఫీస్ వద్ద ధర్నాలో ఐఎఫ్‌టియు నగర కార్యదర్శి ఎర్రిస్వామి

నిరసన వ్యక్తం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

అనంతపురం, మార్చి16 ప్రభాతవార్త బ్యూరో
కేంద్ర ప్రభుత్వం కార్మికులు హక్కులు హరించడం కోసం ప్రత్యేక చట్టాలు తీసుకురావడం సరికాదని ఐఎఫ్‌టియు నగర కార్యదర్శి బి.ఎర్రిస్వామి పేర్కొన్నారు. సోమవారం స్థానిక భైరవనగర్ లోని లేబర్ కార్యాలయం ముందు రాష్ట్ర కమిటి పిలుపు మేరకు ధర్నా నిర్వహించారు. భైరవనగర్‌లో లేబర్ ఆఫీస్ దగ్గరికి హౌసింగ్ బోర్డ్ క్రాస్ నుండి కార్మికుల జనం కదంబెక్కిన ర్యాలీగా చేసుకుంటూ నినాదాలు హోరెత్తయి కార్మికుల పెద్ద ఎత్తున 300 మంది దాకా ర్యాలీగా బయలుదేరి భైరవనగర్‌లో లేబర్‌ఆఫీస్‌కు చేరుకుని, కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రిస్వామి మాట్లాడుతూ..కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాత ఇరవై తొమ్మిది చట్టాలను కుదిస్తూ నాలుగు లేబర్ కోట్లుగా ఏర్పాటు చేసి జీవో తెచ్చిందని, ఆ జీవోని వెంటనే ఎత్తివేయాలని నాలుగు లేబర్ కోట్లు రద్దు చేసే వరకు పోరాడు తామన్నారు. కార్మికుల రావలసినటువంటి సంక్షేమ పథకాలు అన్నీ కూడా అమలుపరచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిమాండ్ చేశారు. అలాగే కార్మికుడు సాధారణంగా మరణం పొందితే రూ.5 లక్షలు, యాక్సిడెంట్‌గా మరణిస్తే రూ.10లక్షలు కార్మికుడు కుటుంబానికి వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టియు భవన నిర్మాణ కార్మిక సంఘానికి మద్దతుగా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా అధ్యక్షులు నాగరాజు, అలాగ అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణ కోశాధికారి రాయుడు, అఖిల భారత్ రైతు కూలీ సంఘం తరిమెల రామాంజనేయులు, గుంతకల్లు రామాంజనేయులు, రంగనాయకులు, తిరుపాలు, ఓబులేసు, పట్టణ పేదల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఫక్రుద్దీన్, జిల్లా అధ్యక్షులు వీరనారప్ప, అలాగే స్టూడెంట్ యూనియన్ పిడిఎస్‌యు టౌన్ కార్యదర్శి బండారు శంకర, ఏపీ ప్రగతిశీల మహిళా సంఘం పిఓడబ్ల్యువో మహిళా సంఘం శోభక్క, లక్ష్మి, డి.సుంకమ్మ, ఇంద్రవతి, నాగ రాజు, కటారి రాజు, మున్నా, ఆదినారాయణ, పెద్దన్న, ఆంజనేయులు, సుధాకర్, నరసింహులు, భవన నిర్మాణ కార్మిక సంఘం కమిటీ అంజి, కన్వీనర్ గంగాధర్, సంతోష్ నాయక్, ఎస్ఎం భాష తదితరులు పాల్గొన్నారు.

28న పోలీస్ హ్యాకథాన్ - జిల్లా ఎస్పీ జగదీష్


పోస్టర్లను విడుదల చేస్తున్న జిల్లా ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైమ్ మార్చి 16, ప్రభాతవార్త
అనంతపురం జిల్లా పోలీస్ శాఖ, ఖ్వితి. సంస్థ సహకారంతో 2026 మార్చి 28న అనంతపురం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఒక ప్రత్యేక తి. హ్యాకథాన్ నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ పి. జగదీష్ తెలిపారు. ఈ హ్యాకథాన్‌కు సంబంధించిన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 2026 మార్చి 22 వరకు తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తిగా ఉచితం కాగా... పాల్గొనే ప్రతి విద్యార్థికి పార్టిసిపేషన్ సర్టిఫికేట్, విజేతలకు ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు. ఈ హ్యాకథాన్‌లో ఇంజినీరి ంగ్, బిటెక్ , ఎంటెక్ , ఎంసీఎ, బీసీఏ కోర్సులు చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ చేసిన వారిలో ఎంపికైన విద్యార్థులు మార్చి 28న జరిగే ఒకరోజు ఆఫ్‌లైన్ హ్యాకథాన్లో పా ల్గొనే అవకాశం పొందుతారన్నారు. ఈ కార్యక్రమం అనంత పుర ం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించబడు తుందన్నారు. కృత్రిమ మేధస్సు రంగంలో విద్యార్థుల సృజనాత్మ కతను ప్రోత్సహించడం, కొత్త ఆలోచన లను వెలికి తీసుకోవడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. తి. రంగంలో ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

30న జరిగే మాదిగల చైతన్య సదస్సును జయప్రదం చేయండి


కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, మార్చి 16 ప్రభాతవార్త
78 సంవత్సరాల స్వాతంత్ర్య భారతదేశంలో ఎస్సీ, ఎస్టీ ప్రజలపై అనునిత్యం ఏదో ఒకచోట, ఏదో ఒక ప్రాంతంలో మర్డర్లు, మానభంగాలు, అత్యాచారాలు, దాడులు జరుగుతూ వున్నాయని ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 30న నిర్వహించే మాదిగల చైతన్య సదస్సుకు సంబంధించిన ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాదిగలు ప్రజలుకు, మాదిగ నాయకులుకు, అలాగే ఎమ్మార్పీస్ నాయకులు దాదాపు 12 మంది నిర్దాక్షిణ్యంగా హత్యలు జరిగాయని, రాష్ట్రంలో మాదిగలకు రక్షణ ఎక్కడ ఉంది అని వారు ప్రశ్నించారు. మాదిగల హోంమంత్రి అనిత కనీసం వారిని పలకరించడానికి, వారి కుటుంబాలను ఓదార్చడానికి, వారికి భరోసా కల్పించడానికి ప్రయత్నించిన పాపాన పోలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుత్తి అంజన ప్రసాద్, ఎం.ఎస్.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జెన్నే చిరంజీవి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సాకే ఓబులేసు, రాష్ట్ర అధికార ప్రతినిధి మెచ్చిరి జయ ప్రకాష్, యువసేన జిల్లా అధ్యక్షులు శ్రీ రాఘవ, ఎం.ఎస్.ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి సుదర్శన్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాల నాగేంద్ర, రాప్తాడు నియోజకవర్గం అధ్యక్షులు తుముచెర్ల సాకే నర్సింహులు, నార్పల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పవన్ అంజి రాయుడు తదితరులు పాల్గొన్నారు.

సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన కృషికి నేత గువ్వల శ్రీకాంత్ రెడ్డి

సజ్జల రామకృష్ణారెడ్డి పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న గువ్వల శ్రీకాంత్‌రెడ్డి

సజ్జల రామకృష్ణారెడ్డితో గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, సాకే శైలజానాథ్

శింగనమల, మార్చి 16 ప్రభాతవార్త
రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారుడు, వైసిపి రాష్ట్ర నేత సజ్జల రామకృష్ణారెడ్డిని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, పార్టీ రాప్తాడు నియోజకవర్గం పరిశీలకులు గువ్వల శ్రీకాంత్ రెడ్డి సోమవారం ఉండవల్లిలో కలిశారు. శింగనమల నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజనాథ్, గువ్వల శ్రీకాంత్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి గువ్వల శ్రీకాంత్ రెడ్డి పార్టీ ముఖ్య నేతలకు వివరించినట్లు సమాచారం.

ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ తదితరులు

అనంతపురం న్యూటౌన్, మార్చి 16 ప్రభాతవార్త
అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను నగరంలోని జిల్లా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, ఆయన ఆంధ్రరాష్ట్రంలో కోసం చేసిన కృషిని తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారాధ్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా అమరావతి రాజధాని గడ్డపై ఆయనకు ఘన నివాళిగా 58 అడుగుల ఎత్తైన భారీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం తెలుగు జాతికి గర్వకారణమని తెలిపారు. శాఖమూరులో 6.8 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన అమరజీవి స్మృతివనం ఆయన త్యాగస్ఫూర్తిని తరతరాలకు గుర్తు చేసే చారిత్రాత్మక ప్రదేశంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం 58 రోజుల పాటు నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన అమరజీవి త్యాగానికి ప్రతీకగా 58 అడుగుల ఎత్తులో ఈ విగ్రహాన్ని నిర్మించడం విశేషమన్నారు.

వైసిపి మహిళ కార్యకర్తను పరామర్శించిన వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత


బాధిత మహిళను పరామర్శిస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత

అనంతపురం సిటీ, మార్చి 16 ప్రభాతవార్త
టిడిపి నేతల వేదింపులు తాళలేక ఆత్మహత్యకు ప్రయత్నించిన వైసిపి మహిళా కార్యకర్తను వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పరామ ర్శించారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ పరిధిలోని కదదరకుంట గ్రామానికి చెందిన వైఎస్ఆర్‌సిపి సానుభూతి పరురాలు పుష్పలత ఆత్మహత్యకు యత్నించారు. టిడిపి నేతలు పోలీసుల వేదింపుల తాళలేక ఆమె ఆత్మహత్య కు యత్నించడంతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తమై తరలిం చారు. విషయం తెలుసుకున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకట రామిరెడ్డి జిల్లాప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి బాధితురాలిని పరామర్శించారు. ఘటనపై వివరాలను అడిగి తెలుసుకుని అధైర్య పడవద్దని అండగా ఉంటా మని భరోసా ఇచ్చారు. పార్టీ పరంగా అన్ని విధాలా అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

18న ఏడిసిఏ ఆధ్వర్యంలో అంపైర్‌ల ఎంపిక

- ఏడిసిఏ కార్యదర్శి యుగంధర్‌రెడ్డి

అనంతపురం సిటీ, మార్చి 16 ప్రభాతవార్త
అనంతపురం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో 18న ఆర్డిటి స్టేడియంలో క్రికెట్ అంపైర్ల ఎంపికను నిర్వహించనున్నట్లు ఏడిసిఏ కార్యదర్శి యుగంధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఏసిఏ కొత్త అంపైర్ల కోసం ఏప్రిల్ 6 నుంచి 9 వరకు విజయనగరంలో అంపైర్లకు వర్క్‌షాప్‌తోపాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. అందులో పాల్గొనేందుకు ఏడిసిఏ, ఏసియు ఎస్ఏల తరపున ఐదు మందిని ఎంపిక చేయడం జరుగుతోందన్నారు. 18న ఆర్డిటి క్రీడా మైదానంలో ఎంపికకు అవసరమైన స్క్రీనింగ్ పరీక్షను నిర్వహించడం జరుగుతోందన్నారు. తమ ఒరిజినల్ ఆధార్‌కార్డుతో ఆసక్తిగల వారు హాజరు కావాలని ఆయన సూచించారు.

డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ (డిఆర్‌టి-2) సమక్షమునకు
1వ అంతస్తు, త్రివేణి కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్-500001

కేసు నెం. O.A No. 24/2026

డెట్ రికవరీ ట్రిబ్యునల్ (ప్రొసీజర్) రూల్స్, 1993లోని రూల్ 5 యొక్క సబ్ రూల్ (2ఎ)తో చదవబడుతూ చట్టములోని సెక్షన్ 19 యొక్క సబ్ సెక్షన్ (4) క్రింద సమన్లు.

కర్ణాటక బ్యాంక్ లిమిటెడ్
మరియు
మెస్సర్స్ డి.జి. ఎంటర్‌ప్రైజెస్ మరియు ఇతరులు
కు మధ్య

దిగువ వారికి
1. మెస్సర్స్ డి.జి. ఎంటర్‌ప్రైజెస్ ప్రతినిధిగా దాని ప్రొప్రైటర్ శ్రీ సలారి దస్తగిరి, ఇంటి నెం. 18-1-508, వేణుగోపాల్ నగర్, అనంతపురం, ఆంధ్రప్రదేశ్-505001.
2. శ్రీ సలాది దస్తగిరి తండ్రి సలాది రహముతుల్లా, వయస్సు 32 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం, నివాసం: 18-1-508, వేణుగోపాల్ నగర్, అనంతపురం-505001, ఆంధ్రప్రదేశ్.
3. శ్రీమతి దూదేకుల రసూల్ బీ భర్త సలారి దస్తగిరి, వయస్సు: మేజర్, వృత్తి: గృహిణి, నివాసం: 18-1-508, వేణుగోపాల్ నగర్, అనంతపురం-505001, ఆంధ్రప్రదేశ్.

పత్రికా ప్రచురణ ద్వారా సమన్లు

పైన తెలిపిన ఓ.ఎ. నెం. 24/2026తో మీ అందరికి వ్యతిరేకముగా రూ. 2,48,45,888.82 (రూపాయలు రెండు కోట్ల నలభై ఎనిమిది లక్షల నలభై ఐదు వేల ఎనిమిది వందల ఎనభై ఎనిమిది రూపాయల పైసలు ఎనభై రెండు మాత్రమే) వసూలు చేసుకొనుట కొరకు దరఖాస్తుదారు దాఖలు చేసి ఈ సమన్లను జారీ చేయుడమైనది. గౌరవనీయ ట్రిబ్యునల్ వారు ఈ సమన్లను అనంతపురం జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లో సర్క్యులేషన్ గల వార్తా తెలుగు దినపత్రిక మరియు సౌత్ ఇండియన్ టైమ్స్ ఆంగ్ల దినపత్రికలలోపత్రికా ప్రచురణ ద్వారా జారీ చేయుటకు ఉత్తర్వు జారీ చేసి సదరు కేసును 07.04.2026 తేదీకి వాయిదా వేసినారు.

సదరు చట్టములోని సెక్షన్ 19 సబ్‌సెక్షన్ (4)ను అనుసరించి ప్రతివాది అయిన మీకు ఈ క్రింది విధముగా సూచించడమైనది.
i. ఈ సమన్లు జారీ చేయుట ద్వారా మీకు ఎందుకు ఉపశమనము కలిగించకూడదో తెలియజేస్తూ ముప్పై రోజులలోగా కారణము తెలియజేయవలెను.
ii. ఒరిజినల్ దరఖాస్తు యొక్క క్రమ సంఖ్య 3ఎ క్రింద దరఖాస్తుదారు ద్వారా పొందుపరచిన ఆస్తులు మరియు ఆస్తులు కాని ఇతర ఆస్తుల యొక్క వివరములను వెల్లడించుట.
iii. ఆస్తుల అటాచ్‌మెంట్ కొరకు దరఖాస్తు యొక్క వెల్లడి మరియు వాదనలు పెండింగ్‌లో ఉన్నందున ఒరిజినల్ దరఖాస్తు యొక్క క్రమ సంఖ్య 3ఎ క్రింద వెల్లడించిన ఆస్తులు మరియు ఇతర ఆస్తులు లేదా సెక్యూర్డ్ ఆస్తులతో అమ్మకము లేదా ఎటువంటి లావాదేవీలు జరుపుటకు మిమ్మల్ని నిషేధించినారు.
iv. ట్రిబ్యునల్ వారి ముందస్తు అనుమతి లేకుండా ఒరిజినల్ దరఖాస్తు యొక్క క్రమ సంఖ్య 3ఎ క్రింద వెల్లడించిన లేదా పొందుపరచిన ఆస్తులను మరియు/లేదా ఇతర ఆస్తులతో సృష్టించిన సెక్యూరిటీ ఇంటరెస్ట్‌పై సాధారణ కోర్సు పద్ధతి మినహాయించి అమ్మకము, లీజు లేదా ఇతర విధములైన బదిలీలను చేయుటకు మిమ్మల్ని నిషేధించినారు.
v. కావున బ్యాంకు లేదా ఆర్థిక సంస్థల వద్ద నిర్వహిస్తున్న ఖాతాలో సెక్యూరిటీ ఇంటరెస్ట్ గా కలిగి ఉన్న ఆస్తులపై సేల్ ప్రొసీడ్స్ ద్వారా డిపాజిట్స్ మరియు సాధారణ వ్యాపార కోర్సులలో సెక్యూర్డ్ ఆస్తులు లేదా ఇతర ఆస్తులు మరియు ఆస్తుల అమ్మకం ద్వారా తీర్చుటకు సేల్ ప్రొసీడ్స్‌కు మీరు బాధ్యులై ఉన్నారు.

కావున మీకు తెలియజేయడమేమనగా తేది: 07.04.2026న ఉ. 10.30 గంగలకు రిజిస్ట్రార్, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-II, 1వ అంతస్తు, త్రివేణి కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్ సమక్షమునకు వ్యక్తిగతముగా లేదా న్యాయవాది ద్వారా హాజరై మీకు ఎందుకు ఉపశమనం కలిగించాలో తెలుపుతూ కారణం తెలియజేయవలెను. విఫలమైనచో మీ గైర్హాజరు సమయమున సదరు దరఖాస్తుపై వాదనలు విని నిర్ధారించెదరు.
ఈ ట్రిబ్యునల్ సీలు వేసి నా ద్వారా 12 మార్చి 2026న హైదరాబాద్ వద్ద జారీ చేయడమైనది.

సం/- రిజిస్ట్రార్
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-II,
1వ అంతస్తు, త్రివేణి కాంప్లెక్స్, ప్యాలెస్ హైట్స్ హోటల్ బిల్డింగ్, అబిడ్స్, హైదరాబాద్

ధర్మవరం అబివృద్ధి పనులపై శాఖల వారీగా మంత్రిసమీక్ష...!

తాగునీరు, రహదారులు, పారిశుద్యంపై మంత్రి ప్రత్యేక దృష్టి...!

ధర్మవరం,మార్చి16,ప్రభాతవార్త

ధర్మవరంనియోజకవర్గ అబివృద్ధి పనులపై శాఖల వారీగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సోమవారం సాయంత్రం అధికారులతో ఎన్డీఏ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆర్ డబ్ల్యూ ఎస్, సత్యసాయివాటర్ వర్క్స్, పంచాయతీరాజ్, మున్సిపాలిటీ శాఖలకు చెందిన అధికారులతో మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన తాగునీటి సదుపాయాలు, పారిశుద్య నిర్వహణ, గ్రామీణ మౌళిక వసతుల అభివృద్ధి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతోచేపడుతున్న అంశాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో తాగునీటిసమస్య ఎక్కడా తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలనిస్పష్టమైన ఆదే శాలు ఇచ్చారు. సత్యసాయివాటర్ వర్క్స్ ద్వారా ధర్మవరం నియోజ కవర్గంలో సరఫరా అవుతున్న తాగునీటి పరిస్థితిని మంత్రిప్రత్యేకంగా సమీక్షించారు. నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. వేసవికాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలకు తాగునీటి కొరత రాకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే పంచాయతీకరాజ్ శాఖ ద్వారా గ్రామాల్లో చేపడు తున్న రహదారులు, డ్రైనేజీలు, ఇతర మౌళిక వసతుల అభివృద్ధి పనులపు రోగతిని కూడా మంత్రి సమీక్షించారు. పనులు వేగవంతంగా పూర్తీ చేసి ప్రజలకు సకాలంలో ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. మున్సి పాలిటీలో పారిశుద్యం డ్రైనేజీ వ్యవస్థ, వీధిదీపాలు, రహదారుల నిర్వహణ వంటి అంశాలపై మంత్రి ప్రత్యేకంగా చర్చించారు.

అదికారులతో సమీక్ష జరుపుతున్న మంత్రిసత్యకుమార్ యాదవ్

రైతుల సంక్షేమమే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు

- మీడియా సమావేశంలోఎమ్మెల్యే కందికుంట

కదిరి, మార్చి 16 ప్రభాతవార్త

రైతుల సంక్షేమమే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యం అని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ఆర్ అండ్ బి అతిధి గృహంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఇస్తున్న పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ మూడో విడత రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయడం జరిగిందన్నా రు.కాగా కదిరి నియోజ కవర్గంలో రైతన్న నీ కోసం కార్యక్రమం ప్రారంబి ంచామన్నారు. దీనికి తోడుగా ప్రత్యేకంగా కదిరి నియోజకవర్గంలో ముఖ్య మంత్రి చంద్రబాబు సంకల్పమైన రైతులందరికీ సాగునీరు అందించాలన్న, ఉద్దేశంతో ఎడారి ప్రాంతంగా రాయలసీమ మారకుండా ఉండాలని హంద్రీనీవా కాలువల ద్వారా చెరువులను నింపాలని కొన్ని నెలలుగా ఈ కార్యక్రమం జరుగుతూ ఉందన్నారు.

అందులో భాగంగా ఏప్రిల్ వరకు నీళ్లు ఇచ్చే పరిస్థితులు ఉన్నాయన్నారు. ఇవన్నీ తమ పార్టీ నాయకులకు, రైతాంగానికి తెలియ జేయాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. అయితే కొన్నిచోట్ల సప్లై ఛానల్ లో జంగిల్ క్లియరెన్స్ చేయాల్సి ఉందన్నారు. ఆదివారం జిల్లా కలెక్టర్ కదిరి పర్యటన సందర్భంగా ఆయన ఆలోచనలకు మేరకు మన ఊరు, మన నీరు, మన బాధ్యత కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. మొదట నియోజవర్గానికి ఒక జెసిపి ఉంటే చాలని అనుకున్నారని, క్షేత్రస్థాయిలో ఆలోచన చేయగా కొన్ని ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయని, వాస్తవానికి దగ్గరగా లేవని ఆలోచన చేసి తానే చొరవ తీసుకొని ఆరు మండలాలకు 6 జెసిపిలు ఏర్పా టు చేస్తున్నామన్నారు. జెసిపిలు కాలువలో దిగిన పరిస్థితుల్లో ఉన్నచోట రెండు హిటా చీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సత్స ంకల్పంతో చేస్తున్న ఈ కార్యక్ర మాన్ని కూటమి నాయకులు, రైతాంగం సద్విని యోగం చేయాలని ఎమ్మెల్యే పిలుపుని చ్చారు. ఈ ప్రాంత రైతాంగం, ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా చేస్తున్న ఆలో చన అన్నారు. భూగర్భ జలాలు పెంచాలన్న ఆలో చనతో, ప్రతి చుక్క నీటి ని ఒడిసిప ట్టాలని ఆలోచన తోనే తాము ముందుకు వెళ్తున్నామన్నారు. వచ్చే 90 రోజుల్లో ఈ కార్యక్ర మాన్ని సద్విని యోగం చేసుకోవాలని రైతాం గానికి ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి రాజకీ యాలకు చోటు లేకుండా రైతాంగాన్ని ఆదుకోవాల్సి న బాధ్యత మనపై ఉంద న్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకొని ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సమావేశంలో టిడిపి సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

అర్జీలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలి

అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించండి - జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్

అనంతపురం కలెక్టరేట్, మార్చి 16 ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కార వేదిక మరియు రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాల ద్వారా స్వీకరించిన అర్జీలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలని అలాగే అర్జీదారుల సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ ఓ .ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని రెవెన్యూ భవన్ లో సోమవారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్ర మానికి జిల్లా కలెక్టర్ వారితోపాటు జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ రామకృష్ణారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆనంద్ వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భ ంగా జిల్లా కలెక్టర్ ఓ .ఆనంద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్య ల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నదని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా అందే అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం వీడి ప్రత్యేక శ్రద్ధ పెట్టి పని చేయాలని అర్జీదారులకు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలన్నారు. ఫిర్యాదుదా రుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయికి స్వయంగా వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీ దారులు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులో తప్ప నిసరిగా పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించి వాటిని తగ్గించాల న్నారు. అధికారులకు సూచించారు. క్రింది స్థాయి ఉద్యోగ, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి అర్జీలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఎండార్స్ ఇచ్చిన అర్జీలకు జిల్లా అధికారులు కచ్చితంగా పరిశీలించాలని బియాండ్ ఎస్ఎల్ఏ లేకుండా చూడాలన్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై 405 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో సిపిఒ అశోక్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ ఈ శేషాద్రి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు, హౌసింగ్ పీడీ శైలజ, డి ఎండబ్ల్యూ రామ సుబ్బారెడ్డి, డిఆర్డీఏ పిడి శైలజ, బీసీ వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, డి ఎం హెచ్ వో డా .ఈ.బీ.దేవి ఏవో అలెగ్జాం దర్ ఆయా శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

మహిళలకోసం కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు విస్తృతపథకాలు

ధర్మవరంటౌన్ , మార్చి 16 ప్రభాతవార్త

మహిళల కోసం కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు విస్తృత పథకాలు ప్రవేశపెడుతున్నాయని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని తిక్కస్వామినగర్ లో టీటీడీ కల్యాణమండపంలో సోమవారం అంతర్జాయ మహిళా దినోత్సవ వేడుకల్లో మంత్రితో పాటు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదనరెడ్డి. పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రిమాట్లాడుతూ.. మహిళలకు సమాజంలో సమానగౌరవం, సమాజ అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం నిర్వహించ బడిందన్నారు. మనసమాజంలో మహిళల ప్రాధాన్యత ఎంతో గొప్పదని, మహిళల గౌరవం, సాధికారత భారతీయ సంస్కృతిలో వేల ఏళ్లగా ఉన్న విలువలని అన్నారు. దేశంలో అత్యున్నత పదువుల్లో సేవలందిస్తున్నారన్నారు. వంగల పూడి అనిత ఏపీ హోం మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారన్నారు. ఇటీవల చట్టసభల్లో 33వాతం రిజర్వేషన్ కల్పించడం మహిళా సాధికారతకు చారిత్రాత్మక అడుగన్నారు. మహిళలపై లైంగిక దాడులు, హింస వంటి ఘటనలు పూర్తిగా తగ్గాలని, ఇటువంటి సం ఘటనలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుం టోందన్నారు. అంతకు మునుపు గర్భిణీలకు సీమంతాలు చేశారు. ఈ కార్యక్ర మంలో ఆర్డీఓ రామసుబ్బయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, ఎంపీడీఓ వెంకటేశ్, వార్డు టీడీపీ ఇన్చార్జ్ పల్లపు రవీంద్ర, పల్లపు శివశంకర్ సీడీపీఓజయంతి, సూపర్వైజర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్యాదవ్

ప్రతిరోజు 50 వేల మంది కూలీలు ఉపాధి వచ్చేలా అవగాహన కల్పించాలి

వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

అనంతపురం కలెక్టరేట్ మార్చి 16 ప్రభాతవార్త

ప్రతిరోజు 50 వేల మంది కూలీలు ఉపాధి పనులకు వచ్చేలా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక , ఎన్ఆర్ఈజిఏ, పట్టాదారు పాసుపుస్తకాలు, ఏపిఎంఐపి, హౌసింగ్, బ్యాంకు లింకేజీ, పదవ తరగతి పరీక్షలు, తదితర అంశాలపై ఆయా శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు, ఎపిడిలు, ఎపిఓలు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి పనులకు ప్రస్తుతం ప్రతిరోజు 16,480 మందికిపైగా వస్తున్నారని, రోజు 50 వేల మంది కూలీలు పనులకు వచ్చేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని, కూలీల సంఖ్యను పెంచడంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రోజువారి కూలీల లక్ష్యం పూర్తిగా చేరుకోవాలన్నారు. ఏపీవోలు, ఎంపీడీవోలతో ప్రతిరోజు టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి కూలీల సంఖ్యను మరింత పెంచాలని డ్వామా పీడీ, జెడ్పి సీఈఓలను ఆదేశించారు. ఉపాధి పనుల కింద చేపట్టిన సిసి రోడ్లు 341 పెండింగ్ ఉన్నాయని, బిటి రోడ్లు 61, సీసీ డ్రైన్స్ 39 పెండింగ్ ఉన్నాయని, వెంటనే నెలాఖరులోగా పూర్తి చేసి వెంటనే బిల్లులను అప్లోడ్ చేయాలన్నారు. చేపట్టిన పనులకు సంబంధించి పెండింగ్ ఉన్న బిల్లులను అప్లోడ్ చేయడం చేయాలని ఆదేశించారు. ఇప్పటికీ గ్రౌండ్ కాని పనులను వెంటనే గ్రౌండ్ చేయించాలని, ఏవైతే పనులు గ్రౌండ్ చేసి బిల్లులు అప్లోడ్ చేయించగలమో అలాంటి వాటిని వెంటనే పూర్తి చేయాలన్నారు. మంజూరైన ఫారంపాండ్ పనుల గ్రౌండింగ్ పెంచాలన్నారు. విద్యాశాఖ పరిధిలో మోడల్ ప్రైమరీ స్కూల్ లను ఏర్పాటు చేయాలని, 60 మంది కంటే తక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలు 150 ఉన్నాయని, వాటిలో విద్యార్థుల సంఖ్య పెంచాలని, ఏ పిల్లలు ప్రైవేట్ స్కూళ్లకు వెళ్తున్నారు, ప్రభుత్వ పాఠశాలలో చేర్చుకోవడానికి లేదా అనేది చూడాలని, విద్యార్థులు పాఠశాలలో చేరేలా తల్లిదండ్రులతో మాట్లాడి అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో 60 మంది కంటే తక్కువ ఎన్రోల్మెంట్ ఉన్న పాఠశాలలు ఉండరాదన్నారు. ప్రస్తుతం పదవ తరగతి పరీక్షలు మొదలయ్యాయని, పరీక్ష కేంద్రాలలో తాగునీరు, అన్ని సౌకర్యాలు కల్పించాలని, క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్ళినప్పుడు సంబంధిత ఆర్డీవోలు, డీఎల్డీవోలు, ఎంపీడీవోలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయాలని, ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించేలా చూడాలన్నారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి కార్యచరణ ప్రణాళిక తయారు చేయాలన్నారు. డిఆర్డీఏ పరిధిలో బ్యాంకు లింకేజీలను చేపట్టాలన్నారు. పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారం పెండింగ్ లేకుండా చేపట్టాలన్నారు. హౌసింగ్ సంబంధించి కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా ఇళ్ల పూర్తికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ ఏ.మలోల, జడ్పి సీఈఓ శివశంకర్, డ్వామా పిడి సలీమ్ భాష, వయోజన విద్య ఉపసంచాలకులు వెంకటేశ్వర్లు, పంచాయ తీరాజ్ ఎస్ఈ సుబ్బరాయుడు, సమగ్ర శిక్ష ఏపిసి శైలజ, ఎపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, డిపిఓ నాగరాజునాయుడు, హౌసింగ్ పిడి శైలజ, పిజిఆర్ఎస్ డిటి జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

వీడియోకాన్ సెన్స్ లో జిల్లా కలెక్టర్ ఓ.. ఆనంద్

రైతుల సంక్షేమమే ఎన్డీఏ ప్రభుత్వ ధ్యేయం - గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

పామిడి మార్చి 16: ప్రభాతవార్త

రైతుల సంక్షేమమే ఎన్డీఏ ప్రభుత్వ ధ్యేయం అని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. మండల పరిదిలోని కండ్లపల్లి గ్రామంలో సోమవారం రాత్రి అన్నదాత సుఖీభవ.. మూడో విడత నిధులు విడుదలను పురస్కరించుకుని రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్బంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ రైతులకు లబ్ది చేకూర్చలన్న ఉద్దేశ్యంతో ప్రతిఏటా అన్నదాత సుఖీభవ పేరుతో నగదును వారి అకౌంట్లలో జమ చేస్తుండటం శుభపరిణామం అన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు టిడిపి శ్రేణులు స్వాగతం పలుకుతూ ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ షర్మిల, ఎంపిడిఓ తేజోష్న, డిప్యూటీ ఎంపిడిఓ అశ్వర్థమనాయుడు, వ్యవసాయ అధికారి విజయ్ కుమార్, టిడిపి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్, రైతులు, సచివాలయ ఉద్యోగులు, కూటమి పార్టీల శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతు న్నఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం.

మంత్రి నారా లోకేష్‌తో జె.సి పవన్ భేటీ

తాడిపత్రిఅర్బన్, మార్చి 16 ప్రభాతవార్త

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌తో అనంతపురం పార్లమెంట్ నాయకుడు జె.సి పవన్‌రెడ్డి విజయవాడ ఉండవల్లిలోని నారా లోకేష్ నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా రాజకీ యాల గురించి చర్చించారు. సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లో రాకెట్ వేగంతో దూసుకు పోతున్నాయని ప్రజలందరికీ పథకాలు అందుతున్నాయని, అందరూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని జె.సి పవన్ నారా లోకేష్‌తో చెప్పినట్లు తెలు స్తోంది. అనంతపురం జిల్లా అభివృద్ధికి నారా లోకేష్ చేస్తున్న కృషిని జె.సి పవన్ ప్రస్తావించి కృతజ్ఞతలు తెలిపారు. తాడిపత్రి నియోజకవర్గానికి మరిన్ని నిధులు కేటాయించి ని యో జకవర్గంలో అభి వృద్ధి పనులు జెట్ స్పీడ్‌తో దూ సుకు వెళ్లేలా కృషి చేయాలని జె.సి పవన్ కోరారు. అదిలా వుండగా ప్రస్తుత రాజకీ యాల గురించి ఇరువురు నేతలు చర్చించుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

మంత్రి నారా లోకేష్‌ను కలిసిన జె.సి పవన్‌రెడ్డి

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

తాడిపత్రిఅర్బన్, మార్చి 16 ప్రభాతవార్త

అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలను సోమవారం తాడిపత్రి పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పట్టణంలోని పుట్లూరురోడ్డు సర్కిల్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే కోర్టు ముందు సిబి రోడ్డు వద్ద పెన్షనర్స్ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. వేసవికాలంలో పాదచారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు తలుపుల సురేంద్రనాథ్, ఉపాధ్యక్షులు వంకదారి రాజా, మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ భూమా నాగరాగిణితో పాటు ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి

జెసి దివాకర్ రెడ్డి, జెసి ప్రభాకర్ రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసిన పెరుమాళ్ళ జీవానంద రెడ్డి

అనంతపురం, మార్చి 16 ప్రభాతవార్త బ్యూరో

తాడిపత్రి నియోజకవర్గం మాజీ ఎంపి మాజీ ఎమ్మెల్యే జెసి దివాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్ రెడ్డిలను సోమవారం వారి స్వగృహంలో వ్యాలీ గ్రీన్ గార్మెంట్ అధినేత పిజె ఆర్ సోషల్ సర్వీసెస్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పెరుమాళ్ళ జీవానంద రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జెసి దివాకర్ రెడ్డి ప్రభాకర్ రెడ్డి వారి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుని పరామర్శించారు.

జెసి దివాకర్‌రెడ్డి, జెసి ప్రభాకర్‌రెడ్డిలతో మాట్లాడుతున్న పెరుమాళ్ల జీవానందరెడ్డి

పీజీఆర్ఎస్ పిటీషన్లపై ప్రత్యేక దృష్టి సారించండి - 114 పిటిషన్ల స్వీకరణ జిల్లా ఎస్పీ పి.జగదీష్

అనంతపురం క్రైమ్ మార్చి 16 ప్రభాతవార్త

జిల్లా పోలీస్ కార్యాలయం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో 114 పిటీషన్లు స్వీకరణ కార్యక్రమం జరిగింది. ముఖ్యంగా కుటుంబ కలహాలు, రాస్తా సమస్యలు, ఆర్థిక నేరాలపై అర్జీలు వచ్చాయన్నారు. పిటీషనర్లతో ముఖాముఖి మాట్లాడిన జిల్లా ఎస్పీ జగదీష్ పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. పిటీషనర్లు, వీరి వెంట వచ్చిన కుటుంబ సభ్యులకు ఇస్కాన్ సహకారంతో ఉచిత భోజన సదుపాయం కల్పించారు.

స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ఎస్పీ ప్రజల నుండి వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరిం చారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, వాటిని తక్షణమే పరిశీలించి చట్టపరి ధిలో పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదేవి ధం గా...ఈ కార్యక్రమానికి హాజరైన పిటిషనర్లు, వారి వెంట వచ్చిన వారికి ఇస్కాన్ సంస్థ వారి సహకారంతో ఉచిత భోజన ఏర్పాట్లు చేయ డం జరిగింది. పోలీసు అధికారులు పాల్గొని స్వయంగా వారే భోజ నం వడ్డించారు. ఈ సందర్భంగా ప్రజలు జిల్లా పోలీస్ యంత్రాంగానికి మరియు ఇస్కాన్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ట్రైనీ ఐపిఎస్ అధికారి అశ్విని మణిదీప్, అనంతపురం మహిళా డీఎస్పీ మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

పిటిషనర్ల సమస్యలను శ్రద్ధగా వింటున్న ఎస్పీ జగదీష్

ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన వ్యక్తి పొట్టి శ్రీరాములు

- పొట్టి శ్రీరాములు జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి, మార్చి 16 ప్రభాతవార్త

ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని టవర్‌క్లాక్ సమీపంలో ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సంరద్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసా ద్ మాట్లాడుతూ.. భారత దేశంలో భాష ప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావానికి పొట్టి శ్రీరాములు బలిదానం మార్గదర్శకంగా నిలిచిందన్నారు. ముఖ్యంగా ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు త్యాగం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. అహింస మార్గంలో చేసిన నిరాహార దీక్ష దేశ వ్యాప్తంగా పెద్ద ఉద్యమానికి దారి తీసి ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు బాటలు వేసిందన్నారు. భాష ఆధారిత రాష్ట్రాల ఏర్పాటుకు ఆయన చేసిన త్యాగం దేశానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాజధానిలో ఆయన త్యాగానికి గుర్తుగా 58 అడుగుల భారీ విగ్రహాన్ని ఏర్పా టు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పొట్టి శ్రీరాములు పోరాట పటిమకు ప్రభుత్వం ఇస్తున్న గౌరవానికి నిదర్శనమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వివిఎస్ శర్మ, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

ఆధునిక పద్ధతులతో వ్యవసాయంను లాభసాటిగా మార్చుకోండి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

వంట మార్పిడి, సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

శ్రీ సత్య సాయి జిల్లా, మార్చి 16, ప్రభాతవార్త ప్రతినిధి

రాష్ట్రంలో రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని పుట్టపర్తి శాసనసభ్యురాలు పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పుట్టపర్తి మండలం బీడుపల్లి గ్రామంలో నిర్వహించిన ఖిరైతన్న మీకోసంఖి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి లు పాల్గొని రైతులకు కీలక సూచనలు చేశారు. ప్రకృతి వ్యవసాయం, నీటి పొదుపు అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వాడుకుంటూ, మార్కెట్ లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని కలెక్టర్ సూచించారు. రానున్న ఖరీఫ్ సీజన్‌లో ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. వ్యవసాయంలో డ్రోన్లు, ఆధునిక యంత్రాలను వాడటం ద్వారా పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవచ్చని, పనులు సకాలంలో పూర్తి అవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని 2.60 లక్షల మంది రైతులకు ఒక్కొక్కరికి ..20,000 చొప్పున పథకం కింద నగదు జమ చేశామని ఎమ్మెల్యే సింధూర రెడ్డి తెలిపారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రైతులు ఒకే రకమైన పంటలు వేయకుండా పంట మార్పిడి విధానాన్ని పాటించాలని, సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కృష్ణయ్య, ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, మైక్రో ఇరిగేషన్ అధికారి సుదర్శన్, వ్యవసాయ అధికారి నటరాజ్, ఉద్యాన అధికారి నవీన్, బీడుపల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.

గ్రామ సభలో రైతులకు సూచనలు ఇస్తున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిలు

పద్మశాలీల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తాం

- మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్, మార్చి 16 ప్రభాతవార్త

పద్మశాలీల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మార్కండేయస్వామి ఆలయంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జె.సి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తాడిపత్రిలో పద్మశాలీల సంఘం ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. వారికి తమ వంతు సహకారం అందిస్తున్నామన్నారు. వారు తమ కుటుంబానికి చాలా చాలా మంచి మద్దతుగా నిలుస్తున్నారని అటువంటి వారికి అండగా నిలుస్తామన్నారు. పద్మశాలీ సంక్షేమ సంఘంలో అవకతవకలు జరిగి నిధులు దుర్వినియోగం అయినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో గత ఏడాది జలదుర్గం దామోదర్‌దాసు అధ్యక్షతన కొత్త కమిటీని ఏడాది కాలం పాటు ఉండేలా ఏర్పాటు చేశారు. కమిటీ ఏర్పాటు అయి ఏడాది పూర్తి అయిన సందర్భంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తాడిపత్రి పద్మశాలీ సంఘంలో మరి కొంతమందిని సభ్యులుగా చేర్చుకొని సంఘం బలోపేతానికి కృషి చేయాలని జె.సి ప్రభాకర్‌రెడ్డి సూచించారు. పద్మశాలీలు తమ కుల అభి వృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం నుంచి రావాల్సి న పథకాలు వారికి అందేలా చూడాల్సి న అవసరం ఎంతైనా ఉందన్నారు. పద్మశాలీలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చిన తనను వచ్చి కలువ వచ్చని తాను వారికి అండగా ఉంటానని పేర్కొన్నారు. 9 సంవత్స రాలుగా షాపు రూము లు అద్దెలు చెల్లించకపోవడంతో పట్టణ సిఐ ఆరోహణ రావును పిలిచి 21వ తేదీ సంఘం నాయకులు వచ్చి కలుస్తారని అద్దెలు చెల్లించకుండా ఉన్న వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దాదాపు 70 లక్షల రూపాయలు అద్దెలు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నాయకులు చెన్నా రాజగోపాల్, చెన్నా రంగేష్, వద్ది దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జె.సి ప్రభాకర్‌రెడ్డి

హాజరైన పద్మశాలీలు